## టాప్ న్యూస్

### హైదరాబాద్‌లో నెట్ ఫ్లిక్స్ భారీ కార్యాలయం
- 41 వేల చదరపు అడుగుల్లో.. మెగా ప్లాన్

03

### రూ.10 వేలు ఇస్తే తీసుకోండి
- ఓటు మాత్రం జాగ్రత్తగా వేయండి
- బీహార్ మహిళలకు ప్రియాంక గాంధీ పిలుపు
- బీజేపీది డబుల్ ఇంజిన్ కాదు.. ఢిల్లీ నుంచి నడిచే సింగిల్ ఇంజిన్ అని విమర్శ



02

### బాహుబలికి రికార్డు కలెక్షన్స్
- రీ రిలీజ్‌లోనూ రారాజే



02



కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## రేవంత్ కొత్త గేమ్
### మైనారిటీ మంత్రం మేజిక్ చేస్తుందా?

రాజకీయాలు వర్షా కాల మేఘాల్లాంటివి... ఎప్పుడు ఏ రకంగా పరిస్థితులు మారుతాయో.. ఎక్కడ కురుస్తాయో చెప్పడం కష్టం. తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రస్తుతం అదే దశలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ మంత్రంతో కొత్త చెస్ ఆడుతోంది. అజారుద్దీన్ మంత్రిత్వం పార్టీకి బలం అవుతుందా? లేక బలహీనమవుతుందా? జూబ్లీహిల్స్ లో కారు జోరుకు హస్తం బ్రేక్ వేసిందా? రేవంత్ రెడ్డి అనూహ్య ఎత్తుగడలతో ముందునుండీ ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న కారుపార్టీలో కంగారు కనిపిస్తోంది. కమ్మ, మైనారిటీ వర్గాల సమావేశాలతో గేమ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర మలుపు తిప్పారు. జూబ్లీహిల్స్ బై పోల్ ఫైట్ ఉత్కంఠగా సాగుతోంది. కాంగ్రెస్ ఊహించని ఎత్తులు ప్రత్యర్థులను కంగారుపెడుతున్న భావన కనబడుతోంది. ఆఖరిరోజుల్లో రాజకీయం ఎలాంటి మలుపులు తీసుకుంటుందో ఆసక్తికరం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో చైతన్యం పాళ్ళు ఎక్కువ. ఈ క్రమంలో సిటీ ఓటరు తీర్పుపై తెలుగురాష్ట్రాల్లో ఆసక్తి సహజం. ఇంతకూ జూబ్లీహిల్స్ ఓటరు మదిలో ఏముంది?

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో


Follow: @ANNTELUGU

02-11-2025

# మహా పత్రిక

ANN తెలుగు

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 314 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కేరళలో రిజర్వేషన్ల రచ్చ
- ముస్లింలకు 10 శాతం, క్రిస్టియన్లకు 6 శాతం రిజర్వేషన్లు
- ఓబీసీల్లో ఆందోళన

**మహా:** కేరళలో మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముస్లింలు, క్రిస్టియన్లకు రిజర్వేషన్లు ఇవ్వాలని కేరళ సర్కార్ చేసిన ప్రతిపాదనలతో తీవ్ర దుమారం రేగుతోంది. మత ప్రాతిపదికన కేరళ సర్కార్ కొన్ని వర్గాలకు కోటా కల్పిస్తోందని ఆరోపణలు దేశవ్యాప్తంగా పెను

మిగతా 2లో



# సొంత చెల్లినే గెంటేశారు
## జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం మేలు చేస్తారు?
- ఏ ఆడబిడ్డా పుట్టింటిపై ఆరోపణలు చేయదు
- సొంత చెల్లెలే కేటీఆర్ ను దుర్మార్గుడివని అంటోంది
- ఆస్తిలో వాటా అడుగుతుందనే కవితను ఇంటినుండి తరిమేశాడు
- కేటీఆర్ ముందు కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలి
- కారు షెడ్డుకు పోయిందని.. బిల్లారంగాలు ఆటోలో తిరుగుతున్నారు
- జూబ్లీహిల్స్ బోరబండ కార్నర్ మీటింగ్ లో సీఎం రేవంత్ ఫైర్

**హైదరాబాద్, మహా**

మాజీ మంత్రి కేటీఆర్ తన సొంత చెల్లి కవితనే ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని కేటీఆర్.. జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. కేటీఆర్.. తన చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ ఆడబిడ్డా పుట్టింటిపై ఆరోపణలు చేయదని.. సొంత చెల్లెలే కేటీఆర్ ను దుర్మార్గుడివని అంటోందని విమర్శించారు. బిల్లా, రంగాలు ఆటోలో తిరుగుతూ జూబ్లీహిల్స్ ప్రజల దగ్గర నాటకాలు ఆడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి దెప్పిపొడిచారు. శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండలో సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఆస్తిలో వాటా అడుగుతుందని సొంత చెల్లి కవితనే ఇంటి నుంచి పార్టీ నుంచి తరిమివేసినోడు కేటీఆర్.. అలాంటోడు జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీతను గెలిపించాలని తిరుగుతున్నాడు. ఇదంతా చూస్తుంటే.. కన్నతల్లికి అన్నం పెట్టనోడు..పినతల్లికి బంగారు గాజులు చేయిస్తాడట' అనే సామేత గుర్తొస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

## ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా కల్కి
### మరో ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు
### కృతి సనన్ కు ఉత్తమ నటి అవార్డు



**ముంబై, మహా :** కల్కి మరో అరుదైన ఘనత సాధించింది. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు2025 వేడుకలు ముంబైలో అట్టహాసంగా జరిగాయి. రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ఈ ఏడాది 'ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచి అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. హిందీ చిత్ర పరిశ్రమలో 'చందు ఛాంపియన్' సినిమాతో అద్భుతమైన విజయం అందుకున్న నటుడు కార్తిక్ ఆర్యన్‌కు ఉత్తమ నటుడిగా అవార్డు దక్కింది.

మిగతా 2లో



## కిషన్ రెడ్డిపై లీగల్ యాక్షన్ తీసుకుంటా..
- మంత్రి అజారుద్దీన్ ఫైర్
- కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసు?
- దేశగొప్పతనాన్ని ప్రపంచానికి చాటితే దేశద్రోహినా?

వివరాలు 4లో

## సొంత బావ ఫోన్ ట్యాప్ చేస్తారా?
### ఫోన్ ట్యాపింగ్ పై కవిత సంచలన కామెంట్స్
**బీఆర్ఎస్ లో చాలా అవమానాలు జరిగాయి.. ఆత్మగౌరవం కోసమే బయటకు వచ్చా**



**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తన భర్త ఫోన్ ట్యాప్ చేశారని, సొంత బావ ఫోన్ ను ఎవరైనా ట్యాప్ చేస్తారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వార్త వినగానే కడుపులో దేవినట్లైందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం కరీంనగర్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత బీఆర్ఎస్‌లో చాలా అవమానాలు జరిగాయన్నారు. అన్యాయం జరిగితే భరించేదాన్ని కానీ అవమానాన్ని భరించలేకే ఆత్మగౌరవం కోసమే బయటకు వచ్చానన్నారు. బీఆర్ఎస్ లో చాలా మంది నేతలు అసంతృప్తిలో ఉన్నారని నేను బీఆర్ఎస్ ను వీడాక ఆ పార్టీ నేతలు నాకు టచ్ లోకి వచ్చారని చెప్పారు. జనంబాటలో పాత బీఆర్ఎస్ క్యాడర్ నాతో మాట్లాడుతున్నారని చెప్పారు.



# ఏపీలో తీవ్ర విషాదం
### శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట
- ఘటనలో మంది మృతి, పలువురికి గాయాలు
- సంతాపం ప్రకటించిన సీఎంలు చంద్రబాబు, రేవంత్
- ప్రధాని మోడీ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటన

**శ్రీకాకుళం, మహా:** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ విషాద ఘటనలో 9 మంది మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కార్తీక మాసం శనివారం, పైగా ఏకాదశి కావటంతో భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్లలో తోపులాట జరిగటంతో.... రెయిలింగ్ విరిగిపోవటంతో ఈ విషాదం జరిగినట్టు సమాచారం .ఈ ఆలయాన్ని నాలుగేళ్ల క్రితమే ప్రారంభించారు. సుమారు రూ.20 కోట్లతో నిర్మాణ జరిగింది. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

మిగతా 2లో

## 500 రోజుల తర్వాత మళ్లీ మనమే
- కేసీఆర్ తిరిగి సీఎం అవ్వడం ఖాయం
- పథకాలను రద్దు చేస్తానని రేవంత్ ధమ్కీలు ఇస్తుండు
- రహమత్‌నగర్‌లో రోడ్ షోలో కేటీఆర్ వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** 500 రోజుల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని, కేసీఆర్ తిరిగి సీఎం కాబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## పదేళ్లలో కేసీఆర్ ఫ్యామిలీకే ఉద్యోగాలు
- రాష్ట్రం వస్తే జాబ్స్ వస్తాయని నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర
- అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుంది
- కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్

వివరాలు 4లో

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,29,440 |
| 22 క్యారెట్ | 1,18,650 |
| సిల్వర్ (కేజీ) | 1,90,000 |




## క్రియేటివిటీ హబ్ గా హైదరాబాద్
### వీఎఫ్ఎక్స్, గేమింగ్ అభివృద్ధికి కో క్రియేటర్ గా ప్రభుత్వం
రండి... ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేద్దాం

**ఇండియాజాయ్ 2025 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కేవలం "ఐటీ రాజధాని"గా మాత్రమే కాదు, భారతదేశపు "క్రియేటివిటీ హబ్"గానూ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

మిగతా 2లో

# సొంత చెల్లినే గెంటేశారు



(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయడానికి ముందు.. కవిత చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను అడ్డం పెట్టుకొని కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులు అక్రమంగా సంపాదించుకున్నారని కవిత ఆరోపణలు చేస్తున్నది. దమ్ముంటే ముందు ఆ ఆరోపణలకు కేటీఆర్ సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

**కారును షెడ్డుకు పంపారు**

ప్రజలు కారును షెడ్డుకి పంపించారని సీఎం రేవంత్ విమర్శించారు. బిల్లారంగాలు జూబ్లీహిల్స్‌లో ఆటోల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పేదోళ్ల దైవం పీజేఆర్ మృతిచెందినప్పుడు.. ఆయన కుటుంబానికి ఏకగ్రీవంగా ఇవ్వాలని నిర్ణయం జరిగింది. పీజేఆర్ కుటుంబానికి ఎన్నిక ఏకగ్రీవం చేయాలని ఆనాడు టీడీపీ కూడా మద్దతు ఇచ్చింది. కానీ కేసీఆర్ ఎన్నికలో పోటీ అభ్యర్థిని నిలబెట్టారు. ఒక దుష్ట సంప్రదాయానికి కేసీఆర్ ఆనాడు తెరలేపారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ రాజేయాలని చూస్తోందని అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ వ్యక్తి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో ఆలోచించండని అన్నారు సీఎం రేవంత్. తాడు బొంగరం లేని బీజేపీ ఇక్కడ అభివృద్ధి చేస్తామని అంటోందని ఎద్దేవా చేశారు. బోరబండలో అడిగినోళ్లందరికి రేషన్ కార్డులు ఇచ్చామని.. ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇస్తే బీఆర్ఎస్ కు కడుపు మండుతోందని.. ఆడబిడ్డలు పైసా లేకున్నా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. ఐదేళ్లు మహిళా మంత్రి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఇద్దరు మహిళలను మంత్రులను చేశామని అన్నారు సీఎం రేవంత్. మాగంటి గోపీనాథ్ ఎప్పుడైనా అసెంబ్లీలో ప్రజాసమస్యలు ప్రస్తావించారా అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావాలంటే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని సీఎం రేవంత్ అన్నారు. సమావేశంలో మంత్రి అజారుద్దీన్ , ఎంపీ అనిల్ యాదవ్, అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్, మంత్రి సీతక్క, ఎంపీ మల్లురవి, నేతలు పాల్గొన్నారు.

# పదేళ్లలో కేసీఆర్ ఫ్యామిలీకే ఉద్యోగాలు

- రాష్ట్రం వస్తే జాబ్స్ వస్తాయని నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర
- అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుంది
- కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్




**హైదరాబాద్, మహా:** అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి.. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని ఆరోపించించారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రుణం తీర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కేటీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మెజార్టీ అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసి ఓట్లు అడుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబంలో వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని మండిపడ్డారు.

# 500 రోజుల తర్వాత మళ్లీ మనమే

- కేసీఆర్ తిరిగి సీఎం అవ్వడం ఖాయం
- పథకాలను రద్దు చేస్తానని రేవంత్ ధమ్కీలు ఇస్తుండు
- రహమత్‌నగర్‌లో రోడ్ షోలో కేటీఆర్ వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఓటు వేయకపోతే పథకాలను రద్దు చేస్తానని రేవంత్ ధమ్కీలు ఇస్తున్నాడని అన్నారు. రద్దు చేస్తానని ఎగిరెగిరిపడితే ప్రజలు పెట్టే వాతలకు నీ ప్రభుత్వమే ఆగమయ్యే రోజు దగ్గరలోనే ఉందని వ్యాఖ్యానించారు. ఇది చైతన్యవంతమైన తెలంగాణ అని తెలిపారు. రేవంత్ రెడ్డి లాంటి వాళ్లను గతంలో చాలామందిని చూశామని అన్నారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలంటే మాగంటి గోపీనాథ్ (గోపన్న)కు ఎంతో అభిమానం ఉండేదని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. గోపన్నపై అబిమానాన్ని మరోసారి జూబ్లీహిల్స్ ప్రజలు చాటిచెప్పాలని కోరారు. ప్రతిభానగర్ నుంచి రెహమత్ నగర్ వరకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. 2023లో అత్యధిక మెజార్టీ ఇచ్చింది రెహమత్ నగరే అని గుర్తుచేశారు. ఈసారి 12వేల మెజార్టీ రెహమత్ నగర్ నుంచి వస్తుందని అనిపిస్తోందని తెలిపారు. గోపన్న నిరుపేదల కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కోట్ల రూపాయలతో వాటర్ ట్యాంకులు కట్టి నీటి సమస్యను తరిమికొట్టామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమాన్ని అన్ని వర్గాలకు అందించిన నేత గోపీనాథ్ అని అన్నారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను పచ్చి మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. పథకాలను రద్దు చేస్తానని రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నాడని విమర్శించారు. అసలేం





పథకం ప్రారంభించావ్ రేవంత్ రెడ్డి అని నిలదీశారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను రేవంత్ రెడ్డి రద్దు చేసిండని విమర్శించారు. రేవంత్ రెడ్డి అమలు చేసిన ఏ పథకం చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా అని అడిగారు. స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహిస్తామన్నాడు ఏమైందన్నారు. కేవలం ఐదేళ్ల కోసమే రేవంత్ రెడ్డిని గెలిపించారని చెప్పారు. సరిగ్గా పాలించకపోతే బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారని అన్నారు. కేవలం 500 రోజుల సమయమే ఉందని తెలిపారు. ఎన్టీఆర్ హిల్స్‌లో బ్రహ్మాండమైన స్టేడియం కట్టి మాగంటి గోపీనాథ్ పేరు పెడతామని తెలిపారు.

# హైదరాబాద్‌లో నెట్ ఫ్లిక్స్ భారీ కార్యాలయం

## 41 వేల చదరపు అడుగుల్లో.. మెగా ప్లాన్

**హైదరాబాద్, మహా :** అంతర్జాతీయ దిగ్గజ సంస్థ నెట్ ఫ్లిక్స్ హైదరాబాద్ లో భారీ కార్యాలయం ఏర్పాటుచేస్తోంది. 41వేల చదరపు అడుగుల్లో ఈ కార్యాలయం ఏర్పాటుచేస్తుండగా, ఈ భవనం లోనే మరొక పెద్ద మీడియా సంస్థ వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ కూడా కార్యాలయం నిర్వహిస్తోంది. ఈ లీజు హైదరాబాద్‌కు అర్థవంతమైన సంకేతం అవుతోంది ఈ సంవత్సరం (2025) హైదరాబాద్‌ను ఎన్నో గ్లోబల్ కంపెనీలు కార్యాలయ కేంద్రంగా ఎంచుకున్న సంవత్సరం గా భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా నెట్ ఫ్లిక్స్ భారతీయ మార్కెట్‌లోని కంటెంట్ + టెక్నాలజీ ఆపరేషన్స్‌ను మరింత విస్తరించేందుకు కనిపిస్తుంది. హైదరాబాదు, ముఖ్యంగా హైటెక్ సిటీ ప్రాంతం, టెక్‌కెంద్రమైన ప్రాంతంగా ఉంది. కనీసంగా భవిష్యత్తులో మీడియా + టెక్నాలజీ సమ్మేళనం కోసం ఇండియా ఆపరేషన్స్‌కు ఆకర్షణీయంగా ఉంటుందని భావిస్తున్నారు. వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ వంటి సంస్థలు ఇప్పటికే ఉన్న భవనంలో నెట్ ఫ్లిక్స్ రావడం ఒక "మీడియాటెక్ క్లస్టర్" రూపాన్ని సూచిస్తుంది. స్థానికంగా ఇది ఉద్యోగ అవకాశాలు, ట్యాలెంట్ హబ్‌గా పరిపక్వత, మల్టీనేషనల్ పెట్టుబడులు వంటి అంశాలకు దోహదం చేస్తుంది.

# క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ) సంయుక్తాధ్వర్యంలో హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీలో రెండ్రోజుల పాటు "ఇండియాజాయ్ 2025" పేరిట నిర్వహించనున్న "ఇండియాస్ ప్రీమియర్ మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ కాంగ్రెగేషన్"ను శనివారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం వీఎఫ్ఎక్స్ అవుట్‌పుట్ లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటీటీ కంటెంట్ ప్రొడక్షన్ లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇమేజ్ టవర్ ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబిలిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్ కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా "కో క్రియేటర్" గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా కల్కి

## మరో ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

### కృతి సనన్ కు ఉత్తమ నటి అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

అదే విధంగా తన వైవిధ్యమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కృతి సనన్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది.

**దాదాసాహెబ్ ఫాల్కే ఫాల్కే ఇంటర్నేషనల్ అవార్డ్స్ - 2025 విజేతలు వీరే..**

ఉత్తమ చిత్రం: స్త్రీ 2
ఉత్తమ నటుడు: కార్తీక్ ఆర్యన్
ఉత్తమ నటి: కృతి సనన్
ఉత్తమ దర్శకుడు: కబీర్ ఖాన్ (చందు ఛాంపియన్)
బెస్ట్ ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్: కల్కి 2898 ఏడీ
ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్: దినేష్ విజన్
బెస్ట్ మూవీ క్రిటిక్స్: లాపతా లేడీస్
బెస్ట్ యాక్టర్ క్రిటిక్స్: విక్రాంత్ మాస్సే (సెక్టార్ 36)
బెస్ట్ యాక్ట్రెస్ క్రిటిక్స్: నితాన్షీ గోయెల్
బెస్ట్ వెబ్‌సిరీస్: హీరామండి
బెస్ట్ యాక్టర్ (వెబ్‌సిరీస్): జితేంద్ర కుమార్
బెస్ట్ యాక్ట్రెస్ (వెబ్‌సిరీస్): హ్యూమా ఖురేషి
ఎక్సలెన్స్ ఇన్ ఇండియన్ సినిమా: శిల్పాశెట్టి
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్: ఏఆర్ రెహమాన్
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీ: జీనత్ అమన్
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ మ్యూజిక్ ఇండస్ట్రీ: ఉషా ఉతుప్

# కిషన్ రెడ్డిపై లీగల్ యాక్షన్ తీసుకుంటా

## మంత్రి అజారుద్దీన్ ఫైర్

- కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసు?
- దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటితే దేశద్రోహినా?

**హైదరాబాద్, మహా :** కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై లీగల్ యాక్షన్ తీసుకుంటానని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ హెచ్చరించారు. శనివారం మీడియాతో మాట్లాడిన అజారుద్దీన్.. తనపై వచ్చిన ఆరోపణలపై కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన తాను దేశ ద్రోహినా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే బీజేపీ తనను టార్గెట్ చేసిందని దుయ్యబట్టారు. కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసు? కిషన్ రెడ్డికి కనీసం క్రికెట్ బ్యాట్ అయినా పట్టుకోవడం వచ్చా అని విమర్శించారు. మాట్లాడటానికి ఏమి లేక మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేస్తున్నారు. ఆర్నెళ్లలోపు అజారుద్దీన్ ఎమ్మెల్సీ కాలేరని ఆయన మంత్రి పదవి కేవలం ఆరు నెలల పాటే అంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ అన్నింటికి కాలమే సమాధానం చెబుతుందన్నారు.



# కేరళలో రిజర్వేషన్ల రచ్చ

(మొదటిపేజీ తరువాయి)

సంచలనంగా మారాయి. దీంతో ఈ వ్యవహారంపై జాతీయ బీసీ కమిషన్ దృష్టి సారించింది. రాజకీయ ప్రయోజనాల కోసమే కేరళ ప్రభుత్వం రిజర్వేషన్లను ఇస్తోందని ఆరోపించారు. ఓబీసీలకు ఉన్న రిజర్వేషన్లను.. మైనారిటీ వర్గాలకు పంచాలని ప్రతిపాదనలు చేశారు. ఓబీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం.. క్రైస్తవులకు 6 శాతం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పద్ధతి వల్ల నిజమైన ఓబీసీ వర్గాల హక్కులు ఉల్లంఘన జరుగుతోందని.. వారి ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని జాతీయ వెనకబడిన వర్గాల కమిషన్ అభిప్రాయపడింది.

# బాహుబలికి రికార్డు కలెక్షన్స్

## రీరిలీజ్ లోనూ రారాజే

**మహా:** బాహుబలి: ది ఎపిక్ మూవీ మొదటి రోజే రూ. 10.4 కోట్ల నెట్, రూ. 18 కోట్ల గ్రాస్ కలెక్షన్‌ను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. రీరిలీజ్ అయిన చిత్రాల్లో ఇంత భారీ వసూళ్లు రాబట్టడం ఇదే తొలిసారి అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దళపతి విజయ్ "గిల్లీ" రూ. 10 కోట్లు.. పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ రూ. 8 కోట్లు.. మహేష్ బాబు బిజినెస్‌మెన్ రూ. 5.27 కోట్లు సాధించాయి. అలానే మురారి చిత్రం సైతం రూ. 5 కోట్లు వసూళ్లను సంపాదించింది. అయితే బాహుబలి ఒకే రోజులో ఈ రికార్డులన్నింటినీ అధిగమించి కొత్త చరిత్ర సృష్టించిందని అంటున్నారు.

# టిక్‌టాక్ తరహాలో వీ రీల్స్

**మహా:** ప్రపంచానికి కొత్త తరహా డిజిటల్ అనుభవాన్ని అందించడానికి అమెరికాలో నివసిస్తున్న తెలుగు ఇంజనీర్లు దీన్ని రూపొందించారు. టిక్ టాక్ తరహాలో రూపొందించిన ఈ యాప్ ఇప్పటికే 22 దేశాల్లో విడుదలై, ప్రస్తుతం బీటా దశలో ఉంది. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్‌స్టోర్ నుంచి వీ రీల్స్ ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ కొత్త అనుభవాన్ని ఆస్వాదించొచ్చు. ఒకేచోట సృష్టి, వినోదం, సంభాషణ, సమాజం కలిసిన డిజిటల్ వేదిక. ఇక్కడ ప్రతి యూజర్ ఒక క్రియేటర్. ప్రతి క్షణం ఒక కథ. చిన్న వీడియోలు, ఫోటోలు, క్రియేటివ్ స్టోరీస్.. ఇవన్నీ వ్యక్తిగతంగా ఆసక్తులకు సరిపోయేలా రూపొందించారు.

# రూ.10 వేలు ఇస్తే తీసుకోండి

## ఓటు మాత్రం జాగ్రత్తగా వేయండి

### బీహార్ మహిళలకు ప్రియాంక గాంధీ పిలుపు

బీజేపీది డబుల్ ఇంజిన్ కాదు.. ఢిల్లీ నుంచి నడిచే సింగిల్ ఇంజిన్ అని విమర్శ



**మహా:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీహార్‌లో ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు రూ.10,000 చొప్పున పంచుతున్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. శనివారం బెగుసరాయ్‌లోని బచ్‌వాడా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన భారీ ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. "ఎన్నికలకు ముందు ఏమీ ఇవ్వని పాలకపక్షాలు, ఇప్పుడు రూ.10,000 పంచుతున్నాయి. దీని అర్థం ఏమిటి? వారికిప్పుడు మీ అవసరం పడింది, అందుకే డబ్బు పంచుతున్నారు. వాళ్లు డబ్బులిస్తే తీసుకోండి, కానీ మీ ఓటును మాత్రం చాలా జాగ్రత్తగా వేయండి. మీ ఓటును వాళ్లు కొనడానికి వీల్లేదు" అని ప్రియాంక ప్రజలకు పిలుపునిచ్చారు. "గత 20 ఏళ్లుగా ఆయన బీహార్‌ను పాలిస్తున్నారు. ఇప్పుడు 1.5 కోట్ల ఉద్యోగాలు ఇస్తానంటున్నారు. మరి ఇన్నేళ్లుగా ఎందుకు ఇవ్వలేదు? ప్రజలను అమాయకులు అనుకుంటున్నారా?" అని ఆమె ప్రశ్నించారు. బీజేపీ "డబుల్ ఇంజిన్" నినాదాన్ని ఆమె ఎద్దేవా చేశారు. "నరేంద్ర మోదీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నడుపుతామంటున్నారు. నేను మీకు చెప్పాలనుకుంటున్నాను.. వాళ్లది డబుల్ ఇంజిన్ కాదు. అది ఢిల్లీ నుంచి నడిచే సింగిల్ ఇంజిన్. ఇక్కడ మీ మాటకే కాదు, మీ ముఖ్యమంత్రి మాటకు కూడా విలువ లేదు" అని ప్రియాంక విమర్శించారు. మోదీ, అమిత్ షా పాలనలో బీహార్ ప్రజలు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం మారితేనే ఈ వలసలు ఆగుతాయని అన్నారు.

# ఏపీలో తీవ్ర విషాదం

## శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట

- ఘటనలో మంది మృతి, పలువురికి గాయాలు
- సంతాపం ప్రకటించిన సీఎంలు చంద్రబాబు, రేవంత్
- ప్రధాని మోడీ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలోనే... ఏకాదశి కావటంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**అత్యంత విషాదం: సీఎం చంద్రబాబు..**

ఈ ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించారు. "శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన విడుదల చేశారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్..**

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మృతి చెందిన ఘటన దురదృష్టకరమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషాకరమైన ఘటనలో మరణించిన కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**ఘటనపై స్పందించిన మోడీ.. పరిహారం ప్రకటన**

కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన మీద ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున పరిహారాన్ని పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ప్రకటించారు.

# సీఎంను కలిసిన ప్రభుత్వ సలహాదారు



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన నేపథ్యంలో పి. సుదర్శన్ రెడ్డి.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జుబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు బాధ్యతను సుదర్శన్ రెడ్డికి అప్పగించింది. ఇప్పటి నుంచి ఈ పథకాల అమలును సుదర్శన్ రెడ్డి సమీక్షించనున్నారు. కేబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆరు గ్యారంటీల అమలును ఆయన పర్యవేక్షించనున్నారు. ఇక ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

# కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలి

- పదేళ్ల అక్రమ సంపాదన అహంతో మాట్లాడుతున్నావా?
- ఓటుకు రూ.5 వేలు అడుక్కోండని ఎలా చెప్తున్నావు?
- కేటీఆర్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్




**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాల పాలనలో అక్రమంగా సంపాదించిన అహంతో కేటీఆర్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఓటర్లను కొనుగోలు చేసే పద్ధతిలో ఓటుకు రూ.5 వేలు అడుక్కోండి అని చెప్పడాన్ని అక్షేపించారు. కేటీఆర్‌పై ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన పిర్యాదు చేస్తామని చెప్పారు. ఓటుకు 5 వేల చొప్పున ప్రస్తావన తెచ్చిన అంశాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకొని కేటీఆర్‌పై కేసు పెట్టాలి అని కోరారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఓటు కు రూ.6 వేలు ఇచ్చిన సంస్కృతి బీఆర్ఎస్ పార్టీది అని పొన్నం విమర్శలు గుప్పించారు. ప్రజల అభిమానంతో అభివృద్ధి చేస్తున్నామని, మరింత అభివృద్ధి చేస్తామని విశ్వాసం కలిగిస్తూ ఓట్లు అడుగుతున్నాం అని పొన్నం వెల్లడించారు.

జూబ్లీహిల్స్ ప్రజలు.. కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగా కాంగ్రెస్ కి ఓటు వేసి గెలిపిస్తారు అని ధీమా వ్యక్తం చేస్తారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 కు గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, నూతనంగా ఉద్యోగాలు ఇచ్చాం అని వివరించారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తూ.. డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ, రోడ్లు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచిస్తున్నదని తెలిపారు. ఉప ఎన్నికల్లో ఓటుకు రూ.5 వేలు తీసుకోండి అని చెప్తున్న బీఆర్ఎస్ పార్టీ దుస్థితి చూసి జాలి పడాలి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కై బీజేపీ మూడంకెలు దాటని వ్యక్తిని అభ్యర్థిగా పెట్టిందని విమర్శించారు. మీరు బీజేపీ కి వేసినా.. బీఆర్ఎస్ కు.. బీఆర్ఎస్ కు వేస్తే బీజేపీకి వెళ్తుందని ఓటర్లకు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి జూబ్లీహిల్స్ అభివృద్ధిని ఆకాంక్షించండి మంత్రి పొన్నం పిలుపునిచ్చారు.

# సీఎం మార్పు ఉండదు

- సీఎం లేదా నేను చెబితేనే నమ్మాలి
- మరెవరి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ క్లారిటీ



**కర్ణాటక, మహా:** రాష్ట్ర ప్రభుత్వంలోని నేతలందరూ ఐక్యతతో ఉన్నారని.. ప్రస్తుతానికి తమకు మరో నాయకుడిని వెతకాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. కర్ణాటకలో కొంత కాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల తన తండ్రి రాజకీయ భవిష్యత్తుపై సీఎం సిద్ధరామయ్య కొడుకు చేసిన వ్యాఖ్యలతో ఈ వార్తలు మళ్లీ తెరపైకి వచ్చాయి. దీంతో నవంబరులో సీఎం మార్పు ఉండొచ్చన్న ప్రచారం జోరందుకుంది. ఈ కథనాలను మరోసారి కొట్టిపడేశారు. దీనిపై ఏ విషయమైనా సీఎం లేదా తాను చెబితేనే నమ్మాలని.. మరెవరి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని.. తప్పుడు వార్తలపై కాదని డీకే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం ముందులాగానే కొనసాగుతోందని తెలిపారు. దీంతో రాష్ట్రంలో సీఎం మార్పు విషయంలో వినిపిస్తున్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లైంది. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు.

# రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి..

- **అనుకూల వాతావరణం.. వ్యాపారవేత్తలు ముందుకు రావాలి**
- **కెనడా హైకమిషనర్ ను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **సీఎంతో భేటీ.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్ అంశాలపై చర్చ**



**పెట్టుబడులకు అనుకూల వాతావరణం**

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణ-కెనడా సంబంధాలను మరింత బలపరిచే దిశగా ఈ భేటీ కొనసాగింది. ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, రక్షణ రంగం, పట్టణ మౌలిక సదుపాయాల వంటి కీలక రంగాల్లో కెనడా భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి కెనడా హైకమిషనర్ బృందానికి వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కెనడా వ్యాపారవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలన్నారు. పారిశ్రామిక రంగాలతో పాటు స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, అధునాతన సాంకేతిక కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో క్రిస్టోఫర్ కూటర్ సతీమణి కరెన్, కెనడా మంత్రి ఎడ్ జాగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పుట్టెడు దుఃఖంలో రైతులు

## పట్టించుకోని ప్రభుత్వం.. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి



**నల్లగొండ, మహా :** ప్రభుత్వం చేతకాని తనం ఓ వైపు, ప్రకృతి ప్రకోపం ఓ వైపు అన్నదాతలు పుట్టెడు దుఃఖంలో విలవిలలాడుతు న్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో ఎక్కడ చూసినా హృదయ విధారక దృశ్యాలే కనిపిస్తున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయి ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాల భావి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లా మంత్రులు అడ్డగోలు కమిషన్లు, అక్రమ సంపాదన మీదనే దృష్టి సారించారని ఆరోపించారు. విదేశీ టూర్లల్లో జల్సాలు చేస్తు న్నారని, దోచుకోవడం మీదనే వారి దృష్టి అంతా అంటూ ధ్వజమెత్తా రు. రైస్ మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు లంచాలు మింగి వారికి సాగిలపడ్డారని, మంత్రుల దుర్బుద్ధి కారణంగా మిల్లర్లు రైతులను పీక్కుతింటున్నారని విమర్శించారు. ఎక్కడ చూసినా మొలకలు వచ్చిన ధాన్యం కనబడుతుందని, పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిబంధనలు అన్ని పక్క న పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని పత్తిని కొనుగోలు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఏడిపిస్తున్నదని విమర్శించారు. యూరియా కొరతతో కొన్ని రోజులు ఏడిపించిన ప్రభుత్వం, ప్రస్తుతం ధాన్యం కొనక ఏడిపిస్తున్నదని, తుఫాన్ తో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా షరతులు లేకుండా కొనాలని, లేదంటే బీఆర్ఎస్ తరఫు న ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



## మార్కెట్ యార్డులో రైతులకు తప్పని పందుల బెడద

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మార్కెట్ యార్డులో పందులు స్వైరవిహారం చేస్తున్న పట్టించుకునే నాథుడు లేడని రైతులు వాపోతున్నారు. తుఫాన్ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు ఉన్న కాస్త ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుకు తీసుకు వస్తే పందులు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయని వారు వివరించారు. శుక్రవారం కుప్పగండ్లకి రైతు తన మొక్కజొన్న పంటను ఆరబెట్టేందుకు యార్డుకు తరలిస్తే పందులు నష్టం చేశాయని చెప్పారు.

# రేషన్ డీలర్ శ్రీనివాస్ నివాసంలో 100 కింటోల్ల బియ్యం..!?

## ఈ పాస్ వేలుముద్ర పెట్టకున్న జాతీయ ప్రజా పంపిణీ సరుకుల సరఫరా.. గోడౌన్ ఇంచార్జీకి అంత ప్రేమేంటో...ఏడు కొండల వాడికే ఎరుక

**మంచిర్యాల, మహా :** జైపూర్ మండలం, నరసింగాపూర్ రేషన్ డీలర్ శ్రీనివాస్ నివాసంలో 100 కింటోల్ల బియ్యం..!? ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం సంబంధిత సివిల్ సప్లై అధికారులకు తెలిసిన పోనీ మనవాడే కదా అని ఉర్కుండి పోయినట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నుండి మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల వరకు రేషన్ డీలర్ శీనన్నకు వీరాభిమానులు ఉన్నట్లు కథనాలు వెల్లడవుతున్నాయి. అందుకు నజరానాగా అధికారులకు సదరు (డీలర్) ఆసామికి సహకరించినందుకుగాను నెలకో కొంత కాసుల వర్షాలు కురిపిస్తున్నట్లు వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.... ఈ మధ్య మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావు పేట గ్రామ శివారులో తాటిపల్లి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యుల పేరుతో సుముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ పెద్ద పరిశ్రమను దాదాపు 15 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించినట్లు సమాచారం. ఈ పరిశ్రమకు నరసింగపురం గ్రామం నుండి వడ్లను సేకరించినట్లు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ప్రభుత్వ ప్రజాధనం 1 కోటి 39 లక్షల రూపాయల దుర్వినియోగం చేశాడని పేర్కొంటూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ జైపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానితో జైపూర్ పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ చర్యతో సంబంధిత రేషన్ డీలర్ శ్రీను కుటుంబం మొత్తం కనబడకుంటా పోయారు.

**అక్టోబర్ 29 నాడు రేషన్ బియ్యం సరఫరా**

మంచిర్యాల పౌర సంబంధాల శాఖ కార్యాలయం గోడౌన్ ఇంచార్జ్ నరసింగ పూర్ గ్రామవాసి తాటిపల్లి శ్రీనివాస్ నివాసానికి అక్టోబర్ 29 నాడు (జాతీయ ప్రజా పంపిణీ పథకం) రేషన్ బియ్యాన్ని సరఫరా చేసినట్లు తెలుస్తోంది. సదరు రేషన్ డీలర్ శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల శాఖ గోడౌన్ ఈపాస్ లో వేలిముద్ర పెట్టనప్పటికీ దాదాపు 100 కింటోళ్ల బియ్యాన్ని పంపించడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. గోడౌన్ ఇంచార్జీకి రేషన్ డీలర్ శ్రీనివాస్ పై అంత ప్రేమేంటో...ఏడు కొండల వాడికే ఎరుక

**చరవానికి అధికారి స్పందన కరువు**

నర్సింగా పూర్ రేషన్ డీలర్ శ్రీను తనకు సరుకులు పంపాలని కార్యాలయానికి వెళ్లి చెప్పనప్పటికీ జిల్లా సివిల్ సప్లై అధికారులు నేరుగా ఇంటికి పంపించి బియ్యాన్ని పంపించి స్వామి భక్తిని చాటుకున్నారని తెలుస్తోంది. ఈ అంశంపై వివరాలు తెలుసుకునేందుకు మంచిర్యాల గోడౌన్ ఇంచార్జ్ అమృత్ కుమార్ కు చరవాణి ద్వారా మహా దినపత్రిక పలుమార్లు సంప్రదించగా అధికారి స్పందించ లేదు.

**జిల్లా అధికారులు దృష్టి సారించాలి**

ఈ అక్రమ బియ్యం నిలువపై సంబంధిత మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడంలో డీలర్ శీనుది అందవేసిన చెయ్యని జిల్లావ్యాప్తంగా ప్రచారంలో ఉంది. ఇదివరకు సదరు వ్యక్తి అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలపై ఏసీబీ అధికారులు పలుమార్లు రైడ్స్ నిర్వహించినట్లు కథనాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలకు చెందవలసిన 100 కింటోల్ల బియ్యం మాయమైతే ఎవరు బాధ్యత వహిస్తారో వేచి చూడాల్సిందే...

# రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**మంచిర్యాల, మహా :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సీ లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డీ లో 20022007 మధ్యలో జన్మించిన వారిగా విభజించినట్లు వెల్లడించారు. మొదట కేటగిరి ఏ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కేటగిరి సీ, క్యాటగిరి డీ లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బి ఎల్ ఓ లు, బి ఎల్ ఓ సూపర్ వైజర్ల ద్వారా కేటగిరి ఏ ఓటరు జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించి కేటగిరి సీ, డీ లను కేటగిరి ఏ కు అనుసంధానం చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వినతి

**ఆమనగల్లు, మహా:** జిల్లాలో ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని జిల్లా విద్యాధికారికి టీపీ స్యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయనను కలిసిన వారు మాట్లాడారు. పాఠశాలలలో అవసరమైన వర్క్ అడ్జెస్ట్మెంట్ అమలు చేయాలని, జీవో 190 ప్రకారం డిప్యూటేషన్లు ఇవ్వాలని, ఉత్తమ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కడ్తాల్ మండల శాఖ అధ్యక్షులు జంగయ్య పాల్గొన్నారు.

# ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ బిఎస్.ఎ సమావేశం




**భువనగిరి, మహా :** భువనగిరి జిల్లా కేంద్రంలో బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష అభినయం బీఎస్.ఎ పై జరిగిన సదస్సును శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు క్లాస్ బోధించి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గంట విద్యాసాగర్ రెడ్డి ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్ నాగారం అంజయ్య కుక్కదువు సోమయ్య తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల ఆర్థిక సాయం

## కాశీబుగ్గ బాధితులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన లోకేశ్

### క్షతగాత్రులకు రూ.3 లక్షల చొప్పున సాయం: మంత్రి



**శ్రీకాకుళం, మహా:** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున సాయం అందిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. క్షతగాత్రులకు రూ.3 లక్షల చొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. కాశీబుగ్గలోని ఘటనా స్థలితో పాటు, పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '94 ఏళ్ల వృద్ధుడు సొంత ఖర్చుతో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. ఇంత మంది భక్తులు వస్తారని ఎవరూ ఊహించలేదు. బారికేడ్లు ఏర్పాటు చేసినా రద్దీ కారణంగా సరిపోలేదు. విషయం తెలిసిన వెంటనే మంత్రి, ఎమ్మెల్యే, అధికారులను అప్రమత్తం చేశాం. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ప్రజలకు దేవుడిని దగ్గర చేయాలనే సదుద్దేశంతో ఈ ఆలయం నిర్మించారు. తొక్కిసలాట ఘటనపై ఆలయ నిర్వాహకులు, సిబ్బందిని ప్రశ్నిస్తాం. పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 మందికి ప్రాణాపాయం లేదు. తీవ్రగాయాలైన వారికి మెరుగైన చికిత్స అందిస్తాం' అని తెలిపారు.



## ట్రేడర్స్ మేస్త్రీలతో సమావేశం

### ఎంపీడీవో జలంధర్ రెడ్డి.. తహసిల్దార్ దశరథ

**వలిగొండ, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతురావు ఆదేశాల మేరకు వలిగొండ మండలంలోని ట్రేడర్స్ మేస్త్రీలతో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి తహసిల్దార్ దశరథ సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు సిమెంటు ఇనుము అలాగే ఇసుక రేట్లను తక్కువ ధరకు సప్లై చేయాలని వారు సూచించారు ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ కిరణ్ హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం ట్రేడర్స్ యజమానులు ఇటుక బట్టి యజమానులు మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

## జాతీయ రోడ్డు భద్రత అవగాహన సదస్సులో మంచిర్యాల డిసిపి




**మందమర్రి, మహా :** రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ వెల్లడించారు. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి యాపల్ ఏరియాలో సింగరేణి కంపెనీ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, మున్సిపల్, రెవెన్యూ శాఖ, అధికారుల సమన్వయంతో శనివారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత రెండేళ్లలో మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో 17 మంది రోడ్డు ప్రమాదాల ద్వారా చనిపోగా, కేవలం యాపల్ , అంగడి బజార్ ఏరియాలోని జాతీయ రహదారిపైనే ఈ రెండేళ్లలో ఏడుగురు మరణించారని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ రోజు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు విధిగా ఐ.ఎస్.ఐ మార్కు గల హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ఇది తలకు రక్షణ కల్పించి, ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. కారులో ప్రయాణించేవారు ముందు సీట్లలోనే కాక, వెనుక సీట్లలో కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. వాహనాలను అతివేగంగా నడపకుండా, రోడ్డుపై సూచించిన వాహన నియమావళి సూత్రాలను అనుసరించి మాత్రమే ప్రయాణం చేయాలని అన్నారు. రోడ్డు మూల మలుపుల వద్ద, పాఠశాలల వద్ద వేగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండని యువతి యువకులు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ విషయాలలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్‌లో మాట్లాడటం లేదా సందేశాలు చూడటం తీవ్ర ప్రమాదాలకు దారితీస్తుందని చెప్పారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో ముఖ్యంగా జాతీయ రహదారులపై పోలీస్ శాఖ తరపున నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని అన్నారు.

**ఫుట్ ఓవర్ బ్రిడ్జికి హామీ:**

స్థానిక ప్రజల కోరిక మేరకు, యాపల్ అంగడి బజార్ ఏరియాలో త్వరలోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబి) నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి, పోలీస్ శాఖ తరపున కృషి చేస్తామని డిసిపి గారు ప్రజలకు హామీ ఇచ్చారు. ఇదివరకు యాపల్ ప్రాంత ప్రజలు కొంతమంది ప్రజాప్రతినిధులు జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిసిందని అన్నారు. అనంతరం బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ఆయన పేర్కొన్నారు.. వాహనదారులు, డ్రైవర్లు, విద్యార్థులకు నిరంతరం అవగాహన సదస్సులు, కళాజాతలు నిర్వహిస్తూ చైతన్య పరుస్తున్నట్లు వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు (ఆర్ సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్) వంటివి ప్రయాణ సమయంలో తప్పకుండా వెంట ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలు పట్టణ ప్రాంతాలలో రహదారుల మరమ్మతులు, సైన్ బోర్డుల ఏర్పాటు, బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దడం వంటి వాటి కోసం జాతీయ రహదారి, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పోలీస్ శాఖ సమన్వయంతో కృషి చేస్తుందని ఏసిపి తెలిపారు.

**సింగరేణి కంపెనీ సంపూర్ణ సహకారం**

సింగరేణి సంస్థ ప్రమాదాల నివారణ కోసం పోలీసు వారికి ఎల్లవేళలా సింగరేణి కాలరీస్ కంపెనీ సంపూర్ణ సహకారం అందజేస్తుందని మందమర్రి పీఎం శ్యాం సుందర్ అన్నారు. రోడ్డు భద్రత కోసం తమవంతు ప్రయత్నం చేస్తామని, భవిష్యత్తులో కూడా రోడ్ల నిర్మాణానికి నిధులు వెచ్చిస్తామని తెలిపారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక సిఐ శశిధర్ రెడ్డి రోడ్డు భద్రత కమిటీ సభ్యులు యాపల్ ఏరియాకు చెందిన రెండు రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు మంచిర్యాల డిసిపి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంజిత్, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, జాతీయ రహదారి అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# రేవంత్ కొత్త గేమ్

## మైనారిటీ మంత్రం మేజిక్ చేస్తుందా?

**రాజకీయాలు వర్షా కాల మేఘాల్లాంటివి... ఎప్పుడు ఏ రకంగా పరిస్థితులు మారుతాయో.. ఎక్కడ కురుస్తాయో చెప్పడం కష్టం. తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రస్తుతం అదే దశలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ మంత్రంతో కొత్త చెస్ ఆడుతోంది. అజారుద్దీన్ మంత్రిత్వం పార్టీకి బలం అవుతుందా? లేక బలహీనమవుతుందా? జూబ్లీహిల్స్ లో కారు జోరుకు హస్తం బ్రేక్ వేసిందా? రేవంత్ రెడ్డి అనూహ్య ఎత్తుగడలతో ముందునుండీ ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న కారుపార్టీలో కంగారు కనిపిస్తోంది. కమ్మ, మైనారిటీ వర్గాల సమావేశాలతో గేమ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర మలుపు తిప్పారు. జూబ్లీహిల్స్ బై పోల్ ఫైట్ ఉత్కంఠగా సాగుతోంది. కాంగ్రెస్ ఊహించని ఎత్తులు ప్రత్యర్థులను కంగారుపెడుతున్న భావన కనబడుతోంది. ఆఖరిరోజుల్లో రాజకీయం ఎలాంటి మలుపులు తీసుకుంటుందో ఆసక్తికరం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో చైతన్యం పాళ్ళు ఎక్కువ. ఈ క్రమంలో సిటీ ఓటరు తీర్పుపై తెలుగురాష్ట్రాల్లో ఆసక్తి సహజం. ఇంతకూ జూబ్లీహిల్స్ ఓటరు మదిలో ఏముంది?**

**- తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

మాజీ క్రికెటర్, హైదరాబాద్ ఎంపీ మొహమ్మద్ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్, సిటీ పాలిటిక్స్ లో కొత్త చెస్ మొదలుపెట్టింది. ఇది సాధారణ నియామకం కాదు - మైనారిటీ సమీకరణాల గణితంలో ఓ మాస్టర్ కదలిక. "చదరంగంలో కదిలిన మురా పావును చూసి గెలుపును అంచనా వేయలేం". అదే పరిస్థితి ఇప్పుడు జూబ్లీహిల్స్ లో నెలకొంది. జూబ్లీహిల్స్ సీటు చుట్టూ కారు జోరు తగ్గిందా? హస్తం బ్రేక్ వేసిందా? ఈ ప్రశ్న ఇప్పుడు ప్రతీచోటా వినిపిస్తోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు ఇప్పుడు కఠిన పరీక్షలో పడింది. ఒకప్పుడు సులువుగా కనిపించిన గెలుపు ఇప్పుడు సీఎం రేవంత్ ఎత్తుగడలతో తారుమారైంది. హస్తం ఆధిక్యం దిశగా ముందుకు వెళ్తున్నట్లు ఎత్తుగడలు స్పష్టం చేస్తున్నాయి. ప్రదానంగా సోషల్ ఇంజనీరింగ్ లో సీఎం రేవంత్ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చాడు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనూహ్యంగా, అంచనా వేయలేని ఆటగాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కు సవాల్ విసిరి మరీ అభ్యర్థులను మార్చకుండా తన ట్రాప్ లో పడేసిన సమర్థుడు. ఒక్క నిర్ణయంతో మూడు దిశల్లో లెక్కలు మార్చే ఆధునిక పొలిటీషియన్. "ఎద్దు నీటిలో దూకితే అలలు తప్పవు" - అదే రేవంత్ అడుగుల ఫలితం. ఒకవైపు మైనారిటీ బలోపేతం, మరోవైపు కమ్మ సమీకరణాలు, ఈ రెండు లెక్కలతో ఆయన జూబ్లీహిల్స్ పొలిటికల్ గేమ్ ను ఒక్కసారిగా మార్చేశాడు. కమ్మ నేతలతో సమావేశాలు, మైనారిటీ వర్గాల మద్దతు, ఇవి కేవలం సెంటిమెంట్ కాదని - వ్యూహం అని స్పష్టమవుతోంది. జూబ్లీహిల్స్ బైపోల్ ఫైట్ కేవలం ఓ సీటు యుద్ధం మాత్రమే కాదు.. ఇది సిటీ రాజకీయాలపై, రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే ఓ సూచిక. ఓ విప్లవం. అందుకే ఇది బీఆర్ఎస్ కు ఎంత ముఖ్యమో.. కాంగ్రెస్ కు కూడా అంతే ముఖ్యం. ఓ వైపు మైత్రివనంలో ఎన్టీఆర్ విగ్రహం పెడతానని ప్రకటించిన సీఎం, బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెట్టడంతో పాటు విగ్రహం కూడా పెడతామని హామీనిచ్చారు. ఎంఐఎం మద్దతు, అజారుద్దీన్ కు మంత్రి పదవి మాత్రమే కాక సల్మాన్ ఖాన్ ను కలవడం ద్వారా కూడా ముస్లిం మైనారిటీల మద్దతును ఏకపక్షంగా టర్న్ చేసుకునేందుకు సీఎం పకడ్బందీ ఎత్తులు వేస్తున్నారు.







"రేవంత్ రెడ్డి అనూహ్య ఎత్తుగడలతో ముందునుండీ ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న కారుపార్టీలో కంగారు కనిపిస్తోంది. కమ్మ, మైనారిటీ వర్గాల సమావేశాలతో గేమ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర మలుపు తిప్పారు.

"మాజీ క్రికెటర్, హైదరాబాద్ ఎంపీ మొహమ్మద్ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్, సిటీ పాలిటిక్స్ లో కొత్త చెస్ మొదలుపెట్టింది. ఇది సాధారణ నియామకం కాదు – మైనారిటీ సమీకరణాల గణితంలో ఓ మాస్టర్ కదలిక. "చదరంగంలో కదిలిన మురా పావును చూసి గెలుపును అంచనా వేయలేం". అదే పరిస్థితి ఇప్పుడు జూబ్లీహిల్స్ లో నెలకొంది.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనూహ్యంగా, అంచనా వేయలేని ఆటగాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కు సవాల్ విసిరి మరీ అభ్యర్థులను మార్చకుండా తన ట్రాప్ లో పడేసిన సమర్థుడు. ఒక్క నిర్ణయంతో మూడు దిశల్లో లెక్కలు మార్చే ఆధునిక పొలిటీషియన్. "ఎద్దు నీటిలో దూకితే అలలు తప్పవు" – అదే రేవంత్ అడుగుల ఫలితం.

కేసీఆర్ జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇటీవల హరీష్‌రావుకు పరామర్శ సందర్భంలో కేసీఆర్ ముఖచిత్రాన్ని, ఆరోగ్య పరిస్థితిని చూసిన అభిమానులు కలవరం చెందుతున్నారు. హరీష్‌రావు అనుకోని పరిస్థితుల్లో ఇంటికే పరిమితం కాగా, ఇపుడు ప్రచార భారం కేటీఆర్ మోస్తున్నారు. గతంలో పోలిస్తే పార్టీ సీనియర్లలో ఆత్మవిశ్వాసం తగ్గింది. కారులోని కరిష్మా కొద్దిగా మసకబారినట్లే కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ సీటు కూడా చేతికి చిక్కుతుందా? లేక ఆ చేతి జారి పోతుందా? ఇదే ఇప్పుడు బీఆర్ఎస్ వర్గాల్లో పెద్ద చర్చ.

కమలం పార్టీ కూడా ఈసారి నిశ్శబ్ద వ్యూహం ఎంచుకున్నట్లే. ఉద్దేశపూర్వకంగా దూకుడు తగ్గించిందా? లోక్‌సభ తర్వాత భిన్న దిశలో సన్నాహాలు చేస్తున్నదా? "తుఫాను రావడానికి ముందు గాలి నిలుస్తుంది" - అదే ఈ పరిస్థితి కావచ్చు. అయితే కిషన్ రెడ్డిపై ఎంతో కాలంగా గుర్రుగా ఉన్న నేతలు జూబ్లీహిల్స్ సాకుగా కిషన్ రెడ్డిని టార్గెట్ చేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నట్లు కనబడుతోంది.

ఏఐసీసీ దృష్టి తెలంగాణపై కేంద్రీకృతమైంది. తాజాగా అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా మైనారిటీ వర్గానికి ప్రాధాన్యం స్పష్టం చేయడంతో పాటు సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావులకు మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా కేబినెట్ ఖాళీల భర్తీకి విస్తరణకు లైన్ క్లియర్ చేసినట్లు స్పష్టం అవుతోంది. జూబ్లీహిల్స్ బైపోల్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయాలకు కూడా పునాది వేసింది. ప్రక్షాళన పేరిట రేవంత్ కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఖాయమనే సమాచారంపై చర్చ మొదలైంది. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలిస్తే ముఖ్యమంత్రిగా రేవంత్ మరింత పట్టుబిగించడంతో పాటు డిసెంబర్ తర్వాత కొత్త మంత్రులు, కొత్త సమతుల్యతతో ప్రజలకు కొత్త సందేశం అందనుంది.

"వేర్లు బలంగా ఉంటేనే చెట్టు నిలుస్తుంది" అందుకే సీఎం రేవంత్ అదే సూత్రంతో పార్టీ పునర్నిర్మాణం మొదలుపెట్టారు. త్వరలో డీసీసీ అధ్యక్షుల నియామకాలు జరగనుండగా, ఇప్పటికే అభిప్రాయసేకరణ కూడా పూర్తయింది. బ్లాక్ స్థాయి నుండి ఏఐసీసీ పర్యవేక్షణలో కొత్త బృందాల రూపకల్పన జరుగుతోంది. జూబ్లీహిల్స్ బైపోల్ ఈ అన్ని సమీకరణాలకు పరీక్షా స్థలం. ఇక్కడి ఓటరు తీర్పు, సిటీ, రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును నిర్ణయించగలదు. హైదరాబాద్ ఓటరు కేవలం అభ్యర్థిని కాదు, వ్యూహాన్ని కూడా కొలుస్తాడు - ఇది ఇంతవరకు జరిగిన ఎన్నికల అనుభవం. "నది ప్రవాహాన్ని ఎవ్వరూ ఆపలేరు, కానీ దిశను మార్చగలరు" - ఇప్పుడు అదే ప్రయత్నం రేవంత్ చేస్తున్నారు. మైనారిటీ మంత్రంతో దిశ మార్చే ప్రయత్నం, సమీకరణాలను పునర్నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలు చెస్ లాంటివే — ఇక్కడ ఒక్క కదలికే గేమ్ మేక్ లేదా బ్రేక్ అవుతుంది. మైనారిటీ మంత్రం మేజిక్ చేస్తుందా? లేక మరొక సరికొత్త చెస్ బోర్డు విస్తరిస్తుందా? అన్నది రాబోయే వారాల్లోనే తెలుస్తుంది.

రాజకీయాల్లో ప్రతీదీ వర్కవుట్ అవుతుందని అనుకోలేం. గత ప్రభుత్వంలో సీఎంగా ఉన్న కేసీఆర్ భారతదేశంలో దళితులకు ఎవరూ చేయలేనంత తాను చేస్తున్నానని దళితబంధు పథకం ప్రకటించారు. హుజూరాబాద్ బైపోల్ కోసం ప్రకటించిన ఆ పథకం అక్కడ విజయం అందించకపోగా, రాష్ట్రవ్యాప్తంగా ఆశలు పెంచి నష్టం చేసింది. ఇతర బంధులు బయటకొచ్చాయి. హుజూరాబాద్ లో విజయం అందుకోని కేసీఆర్ విభిన్న వ్యూహంతో.. మునుగోడులో వందమంది ఎమ్మెల్యేలను మోహరించి విజయం అందుకున్నాడు. రాజకీయాల్లో పరిస్థితులు, ప్రజలు చూసే విధానం బట్టి తీర్పు ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తవుతున్న సందర్భంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పార్టీకి పెద్ద పరీక్ష. ఈ పరీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ ఎలాంటి శక్తియుక్తులు ప్రదర్శిస్తాడు.. ఎలా విజయం సాధిస్తాడని రాజకీయ ప్రత్యర్థులు, పరిశీలకులు ఆసక్తిగా చూస్తున్నారు.

కేసీఆర్ జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇటీవల హరీష్ రావుకు పరామర్శ సందర్భంలో కేసీఆర్ ముఖచిత్రాన్ని, ఆరోగ్య పరిస్థితిని చూసిన అభిమానులు కలవరం చెందుతున్నారు. హరీష్ రావు అనుకోని పరిస్థితుల్లో ఇంటికే పరిమితం కాగా, ఇపుడు ప్రచార భారం కేటీఆర్ మోస్తున్నారు. గతంలో పోలిస్తే పార్టీ సీనియర్లలో ఆత్మవిశ్వాసం తగ్గింది.

జూబ్లీహిల్స్ బైపోల్ అనేక సమీకరణాలకు పరీక్షా స్థలం. ఇక్కడి ఓటరు తీర్పు, సిటీ, రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును నిర్ణయించగలదు. హైదరాబాద్ ఓటరు కేవలం అభ్యర్థిని కాదు, వ్యూహాన్ని కూడా కొలుస్తాడు – ఇది ఇంతవరకు జరిగిన ఎన్నికల అనుభవం. "నది ప్రవాహాన్ని ఎవ్వరూ ఆపలేరు, కానీ దిశను మార్చగలరు" – ఇప్పుడు అదే ప్రయత్నం రేవంత్ చేస్తున్నారు. మైనారిటీ మంత్రంతో దిశ మార్చే ప్రయత్నం, సమీకరణాలను పునర్నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలు చెస్ లాంటివే - ఇక్కడ ఒక్క కదలికే గేమ్ మేక్ లేదా బ్రేక్ అవుతుంది. మైనారిటీ మంత్రం మేజిక్ చేస్తుందా? లేక మరొక సరికొత్త చెస్ బోర్డు విస్తరిస్తుందా? అన్నది రాబోయే వారాల్లోనే తెలుస్తుంది.

రాజకీయాల్లో ప్రతీదీ వర్కవుట్ అవుతుందని అనుకోలేం. గత ప్రభుత్వంలో సీఎంగా ఉన్న కేసీఆర్ భారతదేశంలో దళితులకు ఎవరూ చేయలేనంత తాను చేస్తున్నానని దళితబంధు పథకం ప్రకటించారు. హుజూరాబాద్ బైపోల్ కోసం ప్రకటించిన ఆ పథకం అక్కడ విజయం అందించకపోగా, రాష్ట్రవ్యాప్తంగా దళితులలో ఆశలు పెంచి చివరకు ఆపార్టీకి నష్టం చేసింది. ఇతర బంధులు బయటకొచ్చాయి. హుజూరాబాద్ లో విజయం అందుకోని కేసీఆర్ విభిన్న వ్యూహంతో.. మునుగోడులో వందమంది ఎమ్మెల్యేలను మోహరించి విజయం అందుకున్నాడు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# అద్భుతానికి అడుగు దూరంలో.. టీమ్ ఇండియా

**మహా:** మహిళల ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం నవీముంబయి వేదికగా జరగనుంది. తుదిపోరులో టీమ్‌ఇండియా.. దక్షిణాఫ్రికాతో తలపడనుంది. సెమీఫైనల్‌లో ఆసీస్‌ను మట్టి కరిపించిన ఉత్సాహంతో టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌పై 125 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన ఆనందంలో దక్షిణాఫ్రికా ఫైనల్‌లోకి అడుగుపెట్టాయి. అయితే ఈ రెండు జట్లలో ఏది గెలిచినా.. ఆ టీమ్ తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకున్నట్లవుతుంది. టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా జట్లు వన్డేల్లో ఇప్పటివరకు 34 సార్లు తలపడ్డాయి. టీమ్‌ఇండియా 20 సార్లు విజయం సాధిస్తే, దక్షిణాఫ్రికా 13 సార్లు గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. అయితే.. ప్రస్తుత వరల్డ్ కప్‌లో (2025) అక్టోబర్ 9న విశాఖపట్నం వేదికగా ఇరుజట్లకు జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా జట్టు 48.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. ప్రస్తుతం టీమ్‌ఇండియా కూర్పు బాగుంది. ఓపెనర్ స్మృతి మంధాన మంచి టచ్‌లో ఉంది. ఆమె ఇప్పటివరకు టోర్నీలో ఎనిమిది మ్యాచుల్లో 389 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ గాయానికి గురైన ప్రతీక రావల్ జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ వచ్చింది. సెమీస్‌లో ఆమె పెద్దగా పరుగులు చేయనప్పటికీ.. క్రీజులో ఉన్నంతవరకు మంచి రిథమ్‌లోనే కనిపించింది. 'లేడీ సెహ్వాగ్'గా పేరున్న ఆమె ఫైనల్‌లో సౌతాఫ్రికాపై విజృంభించే అవకాశం ఉంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రాణిస్తోంది. కష్టం.. అనుకున్న ఆసీస్ మీదే.. భారీ స్కోర్‌ను ఛేదించి మరీ టీమ్‌ఇండియా చరిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుంది. అదే ఊపుతో ఫైనల్‌లోనూ సౌతాఫ్రికాను ఓడించి తొలిసారిగా వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకోవాలని టీమ్‌ఇండియా అభిమానులు కోరుకుంటున్నారు.

## ప్రపంచకప్ గెలిస్తే.. బీసీసీఐ భారీ బొనాంజా

భారత అమ్మాయిలు ప్రపంచ కప్ సాధిస్తే.. వారికి భారీ బొనాంజా ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తోందని సమాచారం. భారత పురుషుల జట్టు 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి కలిపి బీసీసీఐ రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని అందించింది. ఒకవేళ హర్మన్‌ప్రీత్ సేన విశ్వవిజేతగా నిలిస్తే అంతే మొత్తంలో నజరానా ప్రకటించాలని బోర్డు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.



## ప్రైవేట్ విద్యాసంస్థలలో అన్యాయమైన ఫీజు వసూలు

**యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సికిందర్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యాసంస్థల్లో అన్యాయమైన ఫీజులకు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ దీటుగా పోరాడుతుందని వెదిరె సికిందర్ రెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మంగళపల్లి పరిధిలోని భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో పెనాల్టీ ఫీజులు, స్పెషల్ ఫీజులు వంటి అన్యాయమైన రుసుములపై విద్యార్థి ఉద్యమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏ విద్యాసంస్థలు విద్యార్థుల నుండి అన్యాయంగా పెనాల్టీ ఫీజులు, స్పెషల్ ఫీజులు వసూలు చేయడాన్ని మేము సహించేదిలేదని, విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం సరైంది కాదని, విద్యా హక్కుల పరిరక్షణ కోసం యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ డిమాండ్ చేస్తుందని, భవిష్యత్‌లో విద్యార్థులపై అన్యాయ విధానాలకు పాల్పడే ఏ సంస్థను కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించడం జరిగింది. విద్యా రంగంలో పారదర్శకత, న్యాయం కోసం మా ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుక్కల నరేందర్ రెడ్డి, ఎన్ఎస్యుఐ నాయకులు కార్తిక్ పటేల్, అయాన్ పటేల్, ప్రభాస్, కళ్యాణ్, శివ, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అబ్దుల్లా భాస్కర్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, వెదిరె అక్షయ్ రెడ్డి, తుమ్మలూరి మణి, బన్నీ, రామ్‌చరణ్ రెడ్డి, సాత్విక్ చారి, తేజ తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడి సొంతింటి కల నిజమైన వేళ

**ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది .. పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ**



**రంగారెడ్డి జిల్లా మహా:** రాష్ట్రంలోని పేదల సొంతింటి కల నిజం చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని, ఎమ్మెల్యే రంగారెడ్డి, ప్రారంభించి గృహప్రవేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న, పేదవాడి సొంతింటి కల నిజం చేయాలనే సంకల్పంతో రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని, కద్బుల్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల తొలివిడత ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా కొత్తకంటి రాజమణీ బాలయ్య, నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని బాచారం, గౌరెల్లి గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే కొనియాడారు. రైతులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నియోజకవర్గంలో జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఎమ్మెల్యే రంగారెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్స్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ముత్యాల రాజశేఖర్ రావు, బాటసింగారం పిఏసిఎస్ చైర్మన్, ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## మహిళా దొంగల ముఠా హల్చల్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఆటోలో ఆడ దొంగల ముఠా హల్చల్ చేశారు. అత్తాపూర్ పరిధలోని సిరిమల్లె నగర్ లో నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి ఐదుగురు మహిళల దొంగల ముఠా చొరబడి చోరీకి విపల ప్రయత్నం చేశారు. దొంగల గ్యాంగ్ ఆటోలో వచ్చారు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నం చేశారు. అక్కడ ఏమీ దొరకకపోవడంతో మరో పక్క ఇంటికి రెక్కి నిర్వహిస్తూ పరిసరాలను పరిశీలించి పరార్ అయ్యారు. ఈ మొత్తం ఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. మహిళల గ్యాంగ్ ఆటోలో దిగడం, ఇంట్లోకి వెళ్లడం అన్నీ స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. సీసీ ఫుటేజ్ దృశ్యాలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. సిరిమల్లె నగర్ వాసులు పెట్రోలింగ్ పెంచి దొంగతనానికి వచ్చిన మహిళా ముఠాను పోలీసులు త్వరగా పట్టుకోవాలని కోరారు.

## క్రీడలు శరీర దారుణ్యానికి ఎంతో దోహదం

**ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి..**



**మొయినాబాద్ మహా:** క్రీడలు శరీర దారుణ్యానికి ఎంతో దోహదపడతాయని ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హయత్ నగర్ లో గల ఎన్టీఆర్ విద్య సంస్థల్లో నిర్వహిస్తున్న మూడు రోజుల క్రీడోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ నారా భువనేశ్వరి, సీఈవో రాజేంద్ర కుమార్, సిఓఓ గోపిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాగడతో క్రీడలను ప్రారంభించారు. సందర్భంగా బెలూన్లను గాలిలోకి వదిలి విద్యార్థులతో వివిధ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ... విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ క్రీడలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఎన్టీఆర్ విద్యాసంస్థల నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ ఆటల పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఆమె సూచించారు. క్రీడలు ఆడడం వలన శరీర దారుణ్యానికి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. విద్యతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఒక స్థాయిలో ఎదగడం ఎంత గర్వకారణంగా ఉందని ఆమె తెలిపారు. చదివిన కొంతమంది విద్యార్థులు విదేశాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి ఉండడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ విద్య సంస్థలో చదివిన ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులను ఆమె పూలమాల శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ క్రీడోత్సవాలను పాల్గొన్న ఆయా పాఠశాలల విద్యార్థులందరూ విజయవంతం చేయాలని సూచించారు. మూడు రోజులపాటు జరిగే క్రీడోత్సవాలో ఆయా పాఠశాలల నుంచి 3,000 మంది విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులందరికీ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు సిబ్బంది చూసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం క్రీడోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఇందులో పాల్గొన్న వారందరిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర కుమార్, సిఓఓ గోపి, ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు, ప్రిన్సిపల్ ఎస్.జె.రెడ్డి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ నర్సింలు, ఏవో సురేష్, అధ్యాపకులు వివిధ కళాశాలల చైర్మన్లు విద్యార్థులు పాల్గొన్నారు.



### కోర్టు కానిస్టేబులు అవార్డు

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పోలీస్ స్టేషన్లో కోర్టు కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న యాదయ్యకు అవార్డు దక్కిందని ఎస్ ఐ వెంకటేశ్ తెలిపారు. ఓ కేసులో సెషన్ కోర్టులో నిందితులకు శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించినందుకు ఆయనను అధికారులు అవార్డుకు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డుకు ఎంపికైన ఆయనను శనివారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఉన్నతాధికారులు అభినందించారు.


## కడుపు నొప్పితో యువకుడి మృతి



**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలకేంద్రంకు చెందిన పోతుగళ్ల మహేశ్ (27) కడుపునొప్పితో బాధపడుతూ మృతి చెందినట్లు సీఐ గంగాధర్ చెప్పారు. శనివారం రాత్రి అకస్మాత్తుగా కడుపునొప్పి వచ్చి కింద పడిపోయిన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆయన వివరించారు. మృతుడి తండ్రి పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పందుల పెంపకం దారులు మున్సిపల్ నోటీసులకు స్పందించకుంటే చర్యలు తప్పవని కమిషనర్ శంకర్ హెచ్చరించారు. యజమానులతో సమావేశం నిర్వహించేందుకు నోటీసులు జారీ చేసినా ఒక్కరూ స్పందించలేదని చెప్పారు. మార్కెట్లో ఆరబోసిన ధాన్యాన్ని తినడంపై తీవ్రంగా స్పందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ స్పందన రాకుంటే చర్యలు తీసుకుంటామని కమిషన్ తేల్చి చెప్పారు.



పురపాలక సంఘ కార్యాలయము :: ఆమనగల్లు
రంగారెడ్డి జిల్లా

Notices/SPL/2025 date :01.11.2025

ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని పందుల పెంపకం దారులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పట్టణంలో పందుల బెడదపై అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ పందుల బెడద తగ్గకపోగా పందుల యజమానుల నుంచి సరైన స్పందన కూడా రాకపోవడంతో తదుపరి చర్యలు తీసుకునే ముందు మున్సిపాలిటీ పరిధిలోని పందుల పెంపకం దారులతో మునిసిపల్ కమీషనర్ అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయములో తేది:28/10/2025, మధ్యాహ్నం 3:00 గంటలకు సమావేశం నిర్వహించాలని నిర్ణయించి మాకు అందిన మౌలిక సమాచారం ప్రకారం పందుల యజమానులు అని తెలిసిన వారికి పై సమావేశమునకు హాజరు కావాల్సిందిగా నోటీసులు ఇవ్వడమైనది. కానీ ఏ ఒక్కరు హాజరు కాలేదు. పైగా ఈ మధ్య కాలంలో పందుల బెడద మరింత ఎక్కువ అవ్వడంతో పాటు మార్కెట్ లో రైతులు ఆరబోసుకున్న ధాన్యమును పందులు తినేసిన ఘటనలను ఈ కార్యాలయం తీవ్రంగా పరిగణిస్తుంది. కావున తదుపరి చర్యలు తీసుకునే ముందు అసలు పందుల యజమానులు ఎవరో తెలియాలి. కావున పత్రికల ద్వారా సోషల్ మీడియా ద్వారా పందుల



### తుఫాను కారణంగా కూలిన ఇండ్లు...

**బాధితులకు అండగా ఉంటాం...**

**రంగారెడ్డి జిల్లా మహా:** మొంతా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా, మంచాల మండలంలో ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకొని, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం రోజున తుఫాన్ కారణంగా కూలిపోయిన ఆరుట్ల గ్రామానికి చెందిన గట్ల గణేష్, నూకం రమేష్, చిందం యాదయ్య, బొద్రమోని మల్లేష్, నూకం బన్ని తదితరుల ఇండ్లను ఆయన పరిశీలించారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా తుఫాను వల్ల ఇండ్లు కూలిపోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ కంబాలపల్లి బుగ్గరాములు మార లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్ ఎన్నిదుల సురేష్ మానిపాటి వెంకటేష్ నూకం మల్లేష్ నూకం బాలరాజు భాస్కర్ రైనా ఎండి అష్రఫ్ ఇంద్రోజు ఆంజనేయులు నూకం సత్యనారాయణ నూకం లక్ష్మయ్య ఆడెపు మధు నూకం భాస్కర్ నూకం శంకర్ నూకం రమేష్ ఆడెపు బాలయ్య ఆవ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో అభివృద్ధి పనులు..

**కాంగ్రెస్ సీనియర్ యూత్ నాయకుడు పిరంగి భాస్కర్..**



**మొయినాబాద్ మహా:** గ్రామాల రహదారులు బాగున్నప్పుడే రాకపోకలు సాగుతాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిరంగి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ యూత్ నాయకుడు స్వచ్ఛందంగా మోత్కుపల్లి నుంచి రెడ్డిపల్లి వరకు వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో సొంత డబ్బులతో సిమెంట్ కాంక్రీట్ మిల్లర్ తో గ్రామస్తులతో కలిసి గుంతలు పూడ్చే పనిని ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. మోత్కుపల్లి గ్రామం నుంచి రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లాలంటే గుంతల రోడ్డుపై వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై పడిన గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని సొంత డబ్బులతో స్వచ్ఛందంగా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గుంతలు పూడ్చడంతో రోడ్డు ఎంతో బాగుపడి ప్రజలకు ప్రయాణం చేసేందుకు బాగుంటుందని తెలిపారు. రోడ్లు బాగుంటేనే గ్రామాలకు అనుసంధానంగా బంధువులు స్నేహితులు రాకపోకలు నిర్వహిస్తారని తెలిపారు. రోడ్ల అనుసంధానంతో సత్సంబంధాలు గ్రామాలకు పెరుగుతాయని పేర్కొన్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా తన వంతు సహాయంగా మోత్కుపల్లి గ్రామం నుంచి రెడ్డిపల్లి రహదారిని అభివృద్ధిలో భాగంగా పూడ్చే కార్యక్రమాన్ని నిర్వహించాలని భాస్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య పరీక్షలు

**ఆమనగల్లు, మహా:** నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి అన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎలికట్ట గ్రామంలో వన్ మెడి సంస్థ సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.





### కబ్జాదారుల చెర నుండి ప్రభుత్వ భూమికి విముక్తి

మణికొండ వేంకటేశ్వర కాలనీలో 1600 గజాల పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకున్న హైడ్రా అధికారులు

**గండిపేట,మహా:** గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ లోని వెంకటేశ్వర కాలనీలో సర్వే నెంబరూ 22 మరియు 26లో 1600 గజాల పార్కు స్థలాన్ని కబ్జాదారుల చెర నుండి హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకుని అందులో ప్రభుత్వ బోర్డును ఏర్పాటుచేసారు. సదరు కాలనీ వాసులు ఈ పార్కు స్థలాన్ని చాలా కాలంగా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని సంబంధిత శాఖలలో పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ పలితం లేకపోవటంతో చివరికి హైడ్రా ప్రజావాణిలో పిర్యాదు చేయగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సిబ్బంది జేసిబి ల సహాయంతో నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడినందుకు హైడ్రా అధికారులపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సమస్యల పరిష్కారమే తన కర్తవ్యం

**కార్పొరేటర్ తోకల**



**రాజేంద్రనగర్ మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి గ్రామంలో అభివృద్ధిలో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులు బస్తీ వాసులతో కలిసి నాణ్యతను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ లోపాలు లేకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన చోట పనులను ప్రారంభించి త్వరగాతీన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకొని రావాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యం అన్నారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి సిద్ధంగా ఉనన్ని బస్తీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, శ్రీనివాస్ రెడ్డి, బాలరెడ్డి, అనిల్ , జంగ రెడ్డి, సతీష్ రెడ్డి, సాయి హర్ష, బల్ల శివ, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బాలరెడ్డి శ్రీను, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



### మత్తు పదార్థాలతోనే అధిక అనారోగ్య సమస్యలు

**మొయినాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ కిషన్ సింగ్**

**మొయినాబాద్ మహా:** మత్తు పదార్థాలతోనే గ్రామీణ ప్రాంతాల్లో అధిక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని మొయినాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ కిషన్ సింగ్ అన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నషాముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ ఇన్స్పెక్టర్ కిషన్ సింగ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డ్రగ్స్ రహిత దేశంగా మార్చడమే నషాముక్త్ భారత్ ముఖ్య ఉద్దేశమని, దేశ భవిష్యత్తు మార్చే యువతనే మత్తు పదార్థాలకు ఆకర్షితులై కుటుంబాలు,జీవితాలను కోల్పోతున్నారని,మత్తు పదార్థాలతోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరంగా జీవిస్తారని, విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్**



**మొయినాబాద్ మహా:** పాడి పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్.అహ్మద్ పేర్కొన్నారు. శనివారం పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్ సిబ్బందితో కలిసి మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోని రైతుల వద్ద ఉన్న 98 పశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొని టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పాడి పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్.అహ్మద్, పశువైద్య సహాయక సిబ్బంది ప్రసన్న కుమార్, భీంరావు, ఘోరే మియా,పాడి రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డిసిసిబి చైర్మన్ సత్తయ్య

**ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకోవాలి**

**దళారీలను నమ్మి మోసపోవద్దు...రైతులకు సూచించిన చైర్మన్**



**రంగారెడ్డి జిల్లా మహా:** శనివారం కోహెడలో వరి కొనుగోలు కేంద్రాన్ని, టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని, దళారీలకు అమ్మి మోసపోవద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణలోని జిల్లాల వ్యాప్తంగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ, అదనంగా బోనస్ అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం సూచించిన కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడలో, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, తుర్కయంజాల్ రైతు సేవా సంఘం పాలకవర్గ సభ్యులు కొత్త రామ్ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, సత్యనారాయణ రెడ్డి గారు, కృష్ణారెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు బాలుదేవ్ రెడ్డి, నాయకులు, రైతు సోదరులు మరియు డిసిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండలేమురు గ్రామాన్ని సందర్శించిన పశుసంవర్ధక శాఖ జెడి...

**వారం రోజులలో పశువులను తరలించేందుకు చర్యలు**



**రంగారెడ్డి జిల్లా మహా:** రైతుల పంట పొలాలను నష్టం చేస్తున్న పశువులను తరలించడానికి తగు చర్యలు తీసుకుంటామని, రంగారెడ్డిజిల్లా పశు సంవర్ధక శాఖ జేడి మధుసూదన్ తెలిపారు. మంచాల మండలం, బండలేమురు గ్రామంలో రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్న అడవి పశువులను తరలించి, రైతుల పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ఇటీవల మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పశు సంవర్ధక రంగారెడ్డి జిల్లా జెడి మధుసూదన్ శుక్రవారం బండాలేమూర్ వచ్చి రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ, పల్లె వీరయ్య రైతులు మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో సుమారుగా వందలాది పశువులు విచ్చల విడిగా తిరుగుతూ రైతులు వేసిన పంటలను మేసి నాశనం చేస్తున్నాయని అన్నారు. దీంతో అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు వేయకుండా పడవుగా వుంచడం జరిగిందని చెప్పారు. ఉన్న ఒక్కటి రెండు ఎకరాల్లో పంటలు వేసుకోకపోవడంతో బతకలేని పరిస్థితి ఏర్పడింది. పంటలు వేయకపోవడంతో రైతు బరోసా పథకం సహాయం అందడం లేదని అన్నారు. కొద్దిపాటి రైతులు వేసిన పంటలను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కాపలకాయల కాయడానికి నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. 10 సంవత్సరాలుగా పంటలు పశువులు మెసిపోతున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు ఇప్పటికైనా ఇక్కడి పశువులను తరలించాలని తరలించి తమ పంట పొలాలను కాపాడాలని కోరారు పశువులను వారం రోజుల్లో తరలించకపోతే రైతులమంతా కలిసి వాటిని తరలించడానికి పూనుకుంటామని అందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని చెప్పి కోరారు కోరారు అనంతరం జెడి మధుసూదన్ మాట్లాడుతూ రైతుల ఆవేదన పరిస్థితులు అన్నిటిని రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్ గారికి రిపోర్టు అందజేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక ఆరుట్ల డాక్టర్ వనజ,రైతులు మాజీ వార్డ్ మెంబర్ సుదర్శన్ గడ్డం అంజయ్య, నాతి చంద్రయ్య,జోగు సాయిలు, జక్కలి శంకరయ్య, బినమోని రాములు, జపాల శంకర్ , జాపల శ్రీను, పార్వతి శ్రీశైలం,జరూపుల కిషన్, సఖ్య, జోగు సుందరయ్య తదితరులు ఉన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభల వాల్ పోస్టర్ విడుదల

**తెలంగాణ హమాలి జిల్లా అధ్యక్షులు జోగు శేఖర్**



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ హమాలీ యూనియన్ సిఐటియు అనుబంధం యాచారం మండలం కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 10, 11 తేదీలలో జరిగే సిఐటియు జిల్లా నాలుగవ మహాసభల వాల్ పోస్టర్ శనివారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు జోగు శేఖర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి బ్రహ్మయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్ హాజరై మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు ముందుకు తీసుకువస్తున్నారని అన్నారు. దశాబ్ద కాలం కార్మికుల పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మిక వర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. హమాలి కార్మికులకు ప్రమాద బీమా 10 లక్షలు ప్రభుత్వం వర్తించే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హమాలి కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, డ్రస్సులు పండుగ సందర్భంగా బోనస్ లాంటివి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి హమాలీ కార్మికులందరికీ ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హమాలి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్ 10, 11 తేదీలలో సిఐటియు జిల్లా మహాసభల్లో చర్చించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ ఉపాధ్యక్షులు బట్టు సత్యనారాయణ, పున్నం దుర్గయ్య, సహాయ కార్యదర్శి పెంటయ్య, హమాలి కార్మికులు జంగయ్య ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ అరెస్టు

**వివరాలు వెల్లడించిన కేయూసి ఇన్స్పెక్టర్ రవికుమార్**




**హన్మకొండ మహా;** రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న నిందితుడు సెండే అరుణ్ కుమార్ ను ఎట్టకేలకు కేయూసి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద నుండి సుమారు రూ.(6,00,000) లక్షల విలువ గల 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి ఆభరణాల తోపాటు రూ. 56,400/- నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నేరస్తుని వివరాలను సిఐ ఎస్ రవికుమార్ వెల్లడిస్తూ నిందితుడు సెండె అరుణ్ కుమార్, తండ్రి పేరు రామయ్య, వయస్సు: 25 సంవత్సరాలు, కులం: భారే(తోటమాలి), వృత్తి: స్టూడెంట్, నివాసం ఇనెం 677, తేజీగూడ, వాంకిడి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కు చెందిన నిందితుడు స్థానిక డిగ్రీ కాలేజ్ లో బిఎస్సి , బిజెడ్సీ 2022 సంవత్సరంలో పూర్తి చేసిన తర్వాత ఒక సంవత్సరం ఇంటి వద్దనేఖాళీగా ఉండి 2024సంవత్సరం లో ఉద్యోగాల కోసం గ్రూప్ అవడానికి హనుమకొండకు వచ్చి కొద్ది రోజులు రూం కిరాయి తీసుకొని ఉండి చదివేక్రమంలో బెట్టింగ్ లకు బానిసై అప్పులు చేసి అవి ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలను ప్రారంభించి గోపాల్ పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్ళను టార్గెట్ చేసుకొని రాత్రి పూట తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగిలిస్తున్న ఈ నిందితుడు సుమారు 10 నేరాలు చేసానని ఒప్పుకున్నాడు. ఈ సందర్భంగా సిఐ రవి కుమార్ మాట్లాడుతూ ఎవరైనా ఇళ్ళకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్ళేటప్పుడు పక్క ఇళ్ల వారికి లేదా లోకల్ పోలీసు లకు సమాచారం అందించాలని ముఖ్యంగా ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో వరుస దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలు విసిరిన ఈ ఘరానా దొంగ ను ఒక ఛాలెంజ్ గా తీసుకొని నిందితుడిని పట్టుకుని కేసులను ఛేదించిన కేయూసీ పోలీస్ స్టేషన్ ఎస్సైలు పోగుల శ్రీకాంత్, కె నవీన్ కుమార్ తో పాటు క్రైమ్ సిబ్బంది అహ్మద్ పాషా, రాజ శేఖర్, జితేందర్ లను వీరికి సహకరించిన సి సి ఎస్ వరంగల్ సిబ్బంది టీ మధు, బి చందు లను కేయూసి ఇన్స్పెక్టర్ ఎస్ రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## భారీ వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**వరంగల్ హన్మకొండ మహా;** ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ హనుమకొండ జిల్లాలలో సుమారు కొన్ని వేల ఎకరాల్లో చేతికొచ్చిన వరి , పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టంతో పాటు రైతులకు తీవ్ర విషాదాన్నే మిగిల్చాయని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితేల సతీష్ లతో కలిసి వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్ లను వారి కార్యాలయాల్లో కలెక్టర్లను కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఎకరానికి 25 వేల రూపాయల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే అందించాలని రైతుల పక్షాన వారికి వినతిపత్రాలు అందజేయడం జరిగింది. అంతకుముందు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కు రైతుల పక్షాన నష్టపరిహారం పై వినతి పత్రం అందజేశారు. అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి విపత్తు సంభవించినప్పుడు రైతు పక్షపాతి అయిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నష్టపోయిన రైతులను స్వయంగా కలుసుకొని వారిని ఓదార్చారని, పంట మొదట్లో అప్పుడు కేవలం 33 శాతం పంటలు నష్టపోయినప్పటికీ ఎకరాకు 10వేలు చెల్లించడం జరిగిందని గుర్తు చేశారు. అలాంటిది ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన పంట కోతలకు రెడీగా ఉన్న పంటలు పూర్తిగా నీట మునిగాయని ఎకరాకు కేవలం 10 వేలు నష్టపరిహారం చెల్లించడం హాస్యాస్పదమని అన్నారు. రియల్ ఎస్టేట్ చేసే సీఎం రేవంత్ రెడ్డికి రైతుల బాధలు ఎలా తెలుస్తాయని, శుక్రవారం వరంగల్ హనుమకొండ జిల్లాలకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కనీసం రైతులను స్వయంగా కలుసుకొని ఓదార్చకపోవడం నష్టం జరిగిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇవ్వకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో జరిగిన పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించి ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకు, హామీలకు పరిమితం కాకుండా నష్ట పోయిన ప్రతి రైతు కు వెంటనే నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన కోరారు. ముఖ్యంగా రైతులు అధైర్య పడొద్దని మీకు న్యాయం జరిగే వరకు మీ పక్షాన మేమందరం పోరడుతామని తెలిపారు. ఇదంతా కాంగ్రెస్ అసమర్ధ పాలనా, సంబంధిత శాఖ మంత్రుల నిర్లక్ష్యం వల్లనే ఇంత నష్టం జరిగిందని పంటలకు సరైన సమయానికి నీళ్లు, యూరియా ఇచ్చి, కొనుగోలు సెంటర్ లను ఏర్పాట్లను పూర్తి చేస్తే బహుశా ఇంత నష్టం వాటిల్లేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షాన బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## వరద ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**అధికారులు సక్రమంగా నష్టపరిహారం వివరాలను నమోదు చేయాలి**



**వరంగల్ మహా;** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలు నీటిమునిగిపోవడం, గృహ నష్టం, ఆస్తి నష్టం చోటు చేసుకున్న నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నగరంలోని ఎన్టీఆర్ నగర్, బృందావన కాలనీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, వరదల వల్ల ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నష్ట వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సక్రమంగా సమర్థవంతంగా నష్టపరిహారం వివరాలను నమోదు చేయాలని సూచించారు. గృహాల్లో నీరు చేరి పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని అలాగే, బాధిత కుటుంబాలకు అవసరమైన తక్షణ సహాయం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలసమస్యలు తక్షణమే పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని, పునరావాసాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట వరంగల్ మండలం తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, మట్టెవాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు, ఎన్యుమరేటర్లు, తదితరులు ఉన్నారు.

## త్వరగా బురద తొలగింపుకు చర్యలు చేపట్టండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**హన్మకొండ మహా;** నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని కాలనీలలో వరద కారణంగా పేరుకుపోయిన బురద తొలగింపుకు త్వరగా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం హన్మకొండ పరిధి లోని వాజ్ పేయి కాలనీ, టీవీ టవర్ కాలనీ ప్రగతి నగర్ వివేక్ నగర్ అమరావతి నగర్ సమ్మయ్య నగర్ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పునరుద్ధరణ పనులు చేపట్టడానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద ప్రభావం వల్ల దెబ్బతిన్న ఇళ్ల తోపాటు ఏర్పడ్డ నష్టాన్ని అంచనా వేయాలని యంత్రాలతో పాటు పెద్ద సంఖ్యలో సిబ్బంది వినియోగించి ఏర్పడ్డ చెత్త తో పాటు బురదను వేగవంతంగా తొలగించాలని లేకుంటే వ్యాధుల సంక్రమణ జరుగుతుందని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించి కలిషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి , ఈఈ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శాఖల వారీగా నివేదికలను త్వరగా సమర్పించండి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ మహా;** ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కలిగిన నష్టాలపై శాఖల వారీగా నివేదికలు త్వరగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శనివారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో బల్దియా కమిషనర్ చాహేత్ బాజ్ పాయి తో కలసి భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా వాటిల్లిన నష్టాల మీద వరంగల్ జిల్లావ్యాప్తంగా, జిల్లాలోని జిడబ్ల్యూఎంసీ పరిధిలో వివిధ శాఖ ల వారీగా తయారు చేయాల్సిన నివేదికలు, తీసుకోవలిసిన చర్యల గురించి అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం పై పూర్తిగా నష్టం జరిగిన, పాక్షికంగా నష్టం జరిగిన గృహాలు వివరాలు, జలమయమైన గృహాలు, కూలిపోయిన గుడిసెల నష్టం వివరాలను ప్రధానంగా వరంగల్ ఖిలా వరంగల్ నగరాల్లో ఇంటింటికి వెళ్లి నష్టం వివరాలు నమోదు చేసి సోమవారం నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన పంట నష్టం, మత్స్య సంపద నష్టం, లైవ్ స్టాక్ నష్టం, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లు, జాతీయ రహదారుల, విద్యుత్ కు సంబంధించి పడిపోయిన కరెంట్ పోల్స్, ట్రాన్స్ఫార్మర్స్, జరిగిన విద్యుత్ లైన్లు వివరాలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, పాఠశాలలో అంగన్వాడి భవనాలు, కమ్యూనిటీ హాల్స్ గ్రామపంచాయతీ భవనాలకు జరిగిన నష్టం, భారీ మధ్య చిన్న తరహా నీటి పారుదలకు జరిగిన నష్టం, మంచినీటి సరఫరా ట్యాంకులకు పైప్లైన్ లకు జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వం నుండి నిర్దేశించిన ప్రొఫార్మాలు క్షేత్రస్థాయిలో ఫోటోలతో సహా సేకరించి త్వరితంగా సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి సంబంధిత శాఖల పాల్గొన్నారు

## నిజాయితీ చాటుకున్న పీహెచ్ కార్మికుడు



**వరంగల్ మహా;** ఇటీవల సీఎం పర్యటన సందర్భంగా హనుమకొండలో విధులు నిర్వహిస్తున్న బల్దియా పీహెచ్ వర్కర్ కు రెండు బంగారు గాజులు దొరికాయి. వాటిని నిజాయితీతో శనివారం కుడా ఆఫీసులో ఉన్న వైస్ చైర్మన్ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కు చూపించి వీటి యజమానులకు ఎలాగైనా అప్పగించాలని తెలుపగా ఇందుకు కమిషనర్ నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా పీహెచ్ వర్కర్ తెలిపిన వివరాల ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా రోడ్లు ఊడుస్తున్న క్రమంలో ఈ గాజులు దొరికాయని ఇవి సుమారు 2,70,000 లక్షల విలువ ఉంటాయని పోయిన వారు దానికి సంబంధించిన తాలూకు బిల్లును ఇస్తే తూకం వేసిన బంగారం గ్రాములు వారి బిల్లులో ఉన్న బంగారు గాజులు గ్రాములు సరిగ్గా ఉంటే తిరిగి ఇచ్చేస్తామని వారు తెలిపారు.

## పశ్చిమానికే పరిమితమైన సీఎం రేవంత్ రెడ్డి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం ఓ సిటీ లోని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పలు కాలనీలు నీట మునిగిన పట్టించుకోని మీకు కొండా సురేఖ కు రాష్ట్ర మంత్రిగా కొనసాగే హక్కు లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనూ తీవ్ర వరద ప్రభావానికి గురైన మైసయ్య నగర్, బీఆర్ నగర్, ఎన్ఎన్ నగర్, శివ నగర్, పెరుక వాడ, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ, ఎస్సార్ తోట సహా పలు కాలనీలు నీట మునిగి తీవ్ర ఆస్తి నష్టం తో పాటు స్వల్ప ప్రాణ నష్టం జరిగింది. వరంగల్ తూర్పు నియోజకవర్గం లో ఇంత భారీ నష్టం వాటిల్లినా ఇటు వైపు కన్నెత్తి చూడని సీఎం రేవంత్ రెడ్డిని ఏమనాలో తెలియడం లేదని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయి ఉండి సొంత నియోజకవర్గం మొత్తం అతలాకుతలం అయి బాధితులు పుట్టెడు దుఃఖంలో ఉంటే, కాలనీలు మొత్తం నీట మునిగితే సీఎం పక్కన ఫోటోలకు ఫోజులిచ్చారే తప్ప సొంత నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. మంత్రిగా ఉండి వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ఏం తెచ్చారో తెలుపండని ప్రశ్నించారు. నమ్మి ఓటేసిన నియోజకవర్గ ప్రజలను నిండా ముంచిన మీకు ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. ముఖ్యంగా సీఎం పర్యటనలో వరంగల్ తూర్పు నియజకవర్గం పై సిఎం రేవంత్ రెడ్డి కి స్థానిక మంత్రి కొండా సురేఖ కు పట్టింపు లేదని ప్రజలకు దీంతో స్పష్టమైంది. మీ ధంధాలను పక్కన పెట్టి ప్రజలను పట్టించుకోవాలని హనుమకొండ కు సిఎం వచ్చిన వరంగల్ కు రాలేదు అంటే మీకు పరపతి లేదు అనేది తేటతెల్లం అయింది. వర్షాభావంతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి 10 వేలు నష్టపరిహారమని ప్రకటించారు కానీ ఒక రైతుకు ఒక ఎకరానికి 50వేల రూపాయలు పెట్టుబడే అయితే మీరు ఇచ్చేది ఎంత అనేది మీ విజ్ఞతకే తెలియాలి. రైతులకు తక్షణమే ఎకరానికి 50 వేల రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా నగరంలో వరద ముంపుకు గురైన ప్రజలకు తక్షణమే 25 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ , మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు ఆరూరి రమేష్, శ్రీ కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ , డాక్టర్ వన్నాల వెంకట రమణ, బిజెపి సీనియర్ నాయకులు , మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు మోర్చా అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ గ్రామీణ ఉత్పత్తుల ప్రోత్సాహానికి నూతన ఆరంభం

**జాతీయ ఆర్గానిక్ రైతుల సంతను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, జిల్లా కలెక్టర్**



**హన్మకొండ మహా;** ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించే దిశగా, సేంద్రియ వ్యవసాయం, చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం రోజున పబ్లిక్ గార్డెన్స్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళ వేదికలో ఏర్పాటు చేసిన జాతీయ ఆర్గానిక్ రైతుల సంతను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ సంతలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రైతులు, చేనేత కార్మికులు, గిరిజన కళాకారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఉత్పత్తుల ప్రత్యేకతలు, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారు ప్రదర్శించిన సేంద్రియ పంటలు, చేనేత వస్త్రాలు, గిరిజన హస్తకళా ఉత్పత్తులను అభినందించారు.

## పారిశుద్ధ్య నివారణలో మరో ముందడుగు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**షాద్ నగర్, మహా:** పట్టణ పారిశుద్ధ నివారణ కార్యక్రమాల్లో నూతన ఒరవడిని సృష్టిస్తూ మరో విప్లాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతూ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక మున్సిపాలిటీలో కమిషనర్ సునీతా రెడ్డి ఆధ్వర్యంలో రూ. 50 లక్షల నిధులతో డ్రైనేజ్ పైపులను శుభ్రపరిచే జట్టింగ్ వాహనంతో పాటు పట్టణంలో ముఖ్యమైన విధులను శుభ్రపరచేందుకు రూ 5 లక్షల విలువైన స్లీపింగ్ వాహనాలను ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ లాంచనంగా ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య తదితర ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో పురోహితుడు రవి శర్మ నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కల్పించి నూతన విప్లవత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతుందని ఎమ్మెల్యే అన్నారు. నిధులు ఖర్చుకు వెనకాడకుండా అవసరమైన నిధులను కేటాయించి అనేక పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కోట్లాది రూపాయలు నిరంతరంగా ఖర్చు చేస్తూ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మ్యాన్ పవర్ పైనే ఆధారపడకుండా ఇంకా నూతన మార్పులకు శ్రీకారం చుడుతూ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చి డ్రైనేజీ పనులు నిర్వీర్యం అయినప్పుడు వాహనాలను వాడిని శుభ్రం చేసి సమస్యను సాగారం చేసేందుకు జట్టింగ్ వాహనం ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో ముఖ్యమైన విధులను శుభ్రం చేయడానికి స్లీపింగ్ మిషన్ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు. మరిన్ని అవసరమైన వాహనాలను వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ సిబ్బందికి ఇలాంటి కష్టం రాకుండా బాగా సమస్యాత్మకమైన పనులను నివారించేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద దేవి శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నెక్కొండ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం రెడ్ల వాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అధిక వర్షంతో ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఉద్భవించే ప్రమాదం ఉన్నందున ఎలాంటి అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఇంటింటికీ జ్వరం సర్వే చేసి ప్రజలకు అందించాల్సిన ఆరోగ్య సేవలు పై సూచనలు చేశారు. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతిరోజు ఇంటింటి సర్వే ద్వారా వచ్చే రిపోర్టులను జిల్లా అధికారులకు అందించాలని సూచించారు. ఎవరు కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నెక్కొండలో పర్యటించి అక్కడ సిబ్బంది హాజరు రిజిస్టర్ మెడికల్ స్టోర్ రిజిస్టర్ ఐ ఎల్ ఆర్ లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అదేవిధంగా అంటువ్యాధులు మలేరియా, ఫైలేరియా, చికెన్ గునియా ,డెంగ్యూ తీవ్రమైన నీళ్ల విరేచనాలు, జ్వరం, టైపాడ్, వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ఆశా కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు నిరంతరం గ్రామాల్లో ఇంటింటి సర్వే ద్వారా వ్యాధుల నిర్ధారణ సేకరించి గ్రామాలలో మెడికల్ క్యాంపులను నిర్వహించాలని సూచిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎవరికి ఎలాంటి సెలవులు మంజూరు చేయడం లేదని తెలుపుతూ ప్రతిరోజు రిపోర్టులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. సిబ్బంది ఎవరు నిర్లక్ష్యం చేసిన వారిపైన సిసిఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకొని పై అధికారులకు తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది సీసీ నాగరాజు పాల్గొన్నారు.

## చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి కదలిక

**త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ప్రకటించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణ కేంద్రంలో ఎంతో కాలంగా నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో కదలిక ప్రారంభమైంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించిన విధంగానే బ్రిడ్జ్ నిర్మాణ విషయంలో అధికారులు బ్రిడ్జ్ను నిర్మించే స్థలాన్నీ పరిశీలించారు. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టబోతుందని దీనికి సంబంధించిన వెసులుబాటులను పరిశీలించడానికి ఆర్ అండ్ బి శాఖ ఎస్సీ రాజేశ్వరరెడ్డి, అదేవిధంగా విద్యుత్ శాఖ డీఏ శ్యాంసుందర్ రెడ్డి తదితర శాఖల అధికార బృందం కలుసుకున్నారు. శనివారం ఉదయం చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థలం వద్ద స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, స్థానిక మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ నేత చేగూరి రాజేందర్ రెడ్డి తదితర నాయకులు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పనులు చేపట్టేందుకు వెసులుబాటులను పరిశీలిస్తున్నాం ఆర్ అండ్ బి ఎస్ఈ రాజేశ్వరరెడ్డి చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి కు 194 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం మంజూరు చేసిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ తో ఈ రైల్వే వంతెన నిర్మాణ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు అయితే ముందుగా 184 కోట్లు నిధులు విడుదలయ్యాయని ఎస్సీ రాజేశ్వర్ రెడ్డి మీడియాకు తెలిపారు. వంతెన నిర్మాణం వద్ద ప్రస్తుత పరిస్థితులు ఇండ్లు అదేవిధంగా ఇక్కడ విద్యుత్ లైన్లు ఎలా ఉన్నాయి రోడ్డు ఎలా ఉంది అని విషయాలను కూలంకషంగా పరిశీలించడానికి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణంలో డిజైన్ స్వల్ప మార్పులతో పనులు చేపట్టబోతున్నామని త్వరలోనే ఈ పనులు ప్రభుత్వం ప్రారంభించబోతుందని దీని పరిశీలించడానికి ఇక్కడికి వచ్చినట్లు అధికారి రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

**విద్యుత్ వనరులు అడ్డకేగా లేకుండా లైన్లు మార్చుతాం - విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి**

చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా కు ఎలాంటి ఆటంకం కలగకుండా వంతెన నిర్మాణం డిజైన్ కు అనుగుణంగా పనులు చేపట్టేందుకు తమకు ప్రభుత్వం నుండి సమాచారం ఉన్నందున ఇక్కడ పరిశీలన జరపడానికి వచ్చామని షాద్ నగర్ విద్యుత్ శాఖ డిఈ శ్యాంసుందర్ రెడ్డి మీడియాకు తెలిపారు. వంతెనకు ఇరువైపులా ఉన్న కరెంటు సరఫరా విషయంలో ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు సజావుగా జరిగేందుకు డిజైన్ మార్పులకు అనుగుణంగా విద్యుత్ సరఫరా ఉంటుందని ముందస్తుగానే చర్యలు చేపట్టేందుకు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. డిఈ శ్యాం సుందర్ రెడ్డి వెంట ఏడి సత్యనారాయణ, పట్టణ ఏఈ వినోద్ తదితర సిబ్బంది హాజరయ్యారు.

**ఎమ్మెల్యే కృషితో వంతెన నిర్మాణానికి శ్రీకారం - మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్**

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి సహకారం తో చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రభుత్వం చేపట్టబోతుందని దీనికి సంబంధించి బాధితులకు నష్టపరిహారం కింద 34 కోట్ల రూపాయలను కూడా మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద పరిస్థితి పరిశీలించడానికి అధికారులతో కలిసి ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇటీవల 194 కోట్ల రూపాయలను వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించిందని అయితే ముందుగా 184 కోట్లు నిధులు విడుదల చేశారని అధికారులు చెబుతున్నారని తెలిపారు.

## వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టండి

**కమిషనర్ తో కలిసి మేయర్ భద్రకాళి బండ్ సందర్శన**

**వరంగల్ మహా;** వరద ముంపు నివారణకు తగు చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రకాళి బండ్ (రామన్న పేట వైపు) ప్రాంతం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మేయర్ సందర్శించి సమర్థవంత నిర్వహణకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల 29 వ డివిజన్ రామన్న పేట లోని పలు కాలనీ లు నీట మునగడం జరిగిందని భద్రకాళి బండ్ లోని వరద నీటి ప్రవాహం రామన్న పేట వైపు రావడం వల్ల ఈ ప్రాంతం లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని ఈ సమస్య నివారణకు సరియగు ప్రత్యామ్నాయాన్ని ఇంజనీరింగ్ అధికారులు చూపాల్సిన అవసరం ఉందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి ఎం హెచ్ ఓ డా.రాజేష్ ఈ ఈ రవి కుమార్ డి ఈ రాగి శ్రీకాంత్ సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఎస్బీ ఎస్ఐ ఆత్మహత్య



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా నర్సంపేట చెన్నారావుపేట మండల పరిధిలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఆసిఫ్ (57) బలవన్మరణానికి పాల్పడ్డారు. నర్సంపేట పట్టణంలోని వల్లభ్ నగర్ లో ఆయన నివాసం ఉంటున్నారు. అయితే గత కొంత కాలంగా ఆసిఫ్ కుటుంబ కలహాలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం విధులకు సైతం హాజరైన ఆయన రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. చికిత్స నిమిత్తం శుక్రవారం రాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు.

# ఆర్థిక అనిశ్చితి.. స్థిరాస్తి రంగంపై ప్రభావం!




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు, పలు దేశాల నడుమ యుద్ధాలు, ముడి చమురు, బంగారం ధరలు వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడింది. దీని ప్రభావం భారత స్థిరాస్తి రంగంపై పడింది. దేశీయ రియల్టీ రంగంలో విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గాయని వెస్టియాన్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో దేశీయ రియల్టీలోకి 1.76 బిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. అయితే 2025 క్యూ2లోని 1.80 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్లతో పోలిస్తే ఇది 2 శాతం తగ్గుదల కాగా.. గతేడాది క్యూ3లోని 0.96 బిలియన్ డాలర్ల ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్ట్ మెంట్స్‌తో పోలిస్తే మాత్రం 83 శాతం అధికం. 2025 క్యూ3లోని సంస్థాగత పెట్టుబడులలో అత్యధికం వాణిజ్య సముదాయంలోకి వచ్చాయి. 79 శాతం వాటాతో ఈ విభాగంలోకి 1,397.21 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి. ఇక, 11 శాతం వాటాతో నివాస సముదాయంలోకి 191.67 మిలియన్ డాలర్లు, 5 శాతం వాటాతో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలోకి 85.79 మిలియన్ డాలర్లు, 5 శాతం వాటాతో డైవర్సిఫైడ్ విభాగంలోకి 84.82 మిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి.

# మారుతి విక్టోరిస్.. 33వేల బుకింగ్స్

భారత ప్యాసింజర్ వాహన మార్కెట్లోకి ప్రవేశించిన.. మారుతి సుజుకి విక్టోరిస్ ఇప్పటి వరకు 33,000 కంటే ఎక్కువ బుకింగ్‌లను పొందింది. ఇందులో 30 శాతం కంటే ఎక్కువ బుకింగ్స్ CNG వేరియంట్ సొంతం చేసుకుంది. దీనికి కారణం బూట్ స్పేస్ అనే చెప్పాలి. మారుతి సుజుకి తన విక్టోరిస్ కారులో.. సాధారణ కారులో అందించేంత బూట్ స్పేస్ అందిస్తోంది. ఇది CNG వేరియంట్ అమ్మకాలను పెంచడంలో దోహదపడిందని.. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ పేర్కొన్నారు. విక్టోరిస్ CNG వేరియంట్‌లకు ఇప్పటి వరకు దాదాపు 11,000 బుకింగ్‌లు వచ్చాయని వెల్లడించారు. మారుతి సుజుకి విక్టోరిస్.. మంచి డిజైన్, లేటెస్ట్ ఫీచర్స్ పొందుతుంది. ఈ కారు ధరలు రూ.10.50 లక్షల నుంచి రూ. 19.98 లక్షల మధ్య (ఎక్స్‌షోరూమ్) ఉంది. ఇది మొత్తం మూడు పవర్‌ట్రెయిన్ ఎంపికలతో లభిస్తుంది. ఇందులోని 1.5లీటర్ పెట్రోల్ ఇంజిన్ మైల్డ్ హైబ్రిడ్, స్ట్రాంగ్ హైబ్రిడ్, CNG టెక్నాలజీతో అందుబాటులో ఉంటుంది. ఇంజిన్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, 6స్పీడ్ ఆటోమేటిక్ యూనిట్, eCVT ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. మైల్డ్ హైబ్రిడ్ టెక్‌తో కూడిన 1.5లీటర్ ఇంజిన్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ & 6స్పీడ్ ఆటోమేటిక్ యూనిట్‌తో లభిస్తుంది. స్ట్రాంగ్ హైబ్రిడ్ వెర్షన్ eCVTని పొందుతుంది, పెట్రోల్ CNG మోడల్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో వస్తుంది. ఇవన్నీ మంచి పనితీరును అందిస్తాయి.




# జియో-బీపీ మొబిలిటీ హబ్

## ఒకేచోట 28 చార్జింగ్ పాయింట్స్



జియో-బీపీ తాజాగా వివిధ రకాల ఇంధనాలతో పాటు చార్జింగ్ పాయింట్లు కూడా ఒకే చోట అందుబాటులో ఉండేలా బెంగళూరులో భారీ స్థాయి సమగ్ర మొబిలిటీ హబ్‌ను తీర్చిదిద్దింది. ఇందులో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ విక్రయిస్తుండగా, ఈవీ చార్జింగ్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ ఔట్‌లెట్‌లో 28 చార్జింగ్ పాయింట్లు, కేఫ్ ఉంటాయని సంస్థ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. 360 కిలోవాట్ల సూపర్‌ఫాస్ట్ చార్జర్లతో వేగవంతంగా వాహనాన్ని చార్జ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. భారత్‌లో ఈ తరహా భారీ సమగ్ర హబ్ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని సంస్థ తెలిపింది. జియో-బీపీకి దేశవ్యాప్తంగా 1,000 ప్రాంతాల్లో 7000 చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి.

# క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్ కేవలం ఐటీ రాజధానిగా మాత్రమే కాదు, భారతదేశపు క్రియేటివిటీ హబ్‌గానూ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ) సంయుక్తాధ్వర్యంలో హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీలో రెండ్రోజుల పాటు 'ఇండియాజాయ్ 2025' పేరిట నిర్వహించనున్న ఇండియాస్ ప్రీమియర్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కాంగ్రెగేషన్ ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం వీఎఫ్ఎక్స్ అవుట్‌పుట్‌లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటీటీ కంటెంట్ ప్రొడక్షన్ లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇమేజ్ టవర్ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబులిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్ కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా "కో క్రియేటర్"గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# అదిగో భారీ క్రాష్

## రిచ్ డాడ్ వార్నింగ్!

'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టింగ్ గురూ రాబర్ట్ కియోసాకి పెట్టుబడుల గురించి మరోసారి హెచ్చరించారు. అంతర్జాతీ మార్కెట్‌ల ఒడిదొడుకుల నేపథ్యంలో 'భారీ క్రాష్ మొదలంది' అంటూ 'ఎక్స్'లో (గతంలో ట్విట్టర్) పోస్ట్ పెట్టారు. లక్షల మంది ఇన్వెస్టర్లు ఆర్థికంగా వినాశనానికి గురవుతారని అంచనా వేశారు. సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థలు హాని కలిగిస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు. వెండి, బంగారం వంటి విలువైన లోహాలు, బిట్ కాయిన్, ఎథేరియం లాంటి క్రిప్టోకరెన్సీలు తిరోగమనం సమయంలో రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయని సూచించారు. 'భారీ క్రాష్ మొదలంది. కోట్ల కొద్దీ పెట్టుబడులు తుడిచిపెట్టుకుపోతాయి. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి. బంగారం, వెండి, బిట్ కాయిన్, ఎథేరియం పెట్టుబడులే మిమ్మల్ని కాపాడేదది' అంటూ తన ట్వీట్‌లో రాబర్ట్ కియోసాకి రాసుకొచ్చారు. కియోసాకి ఇలా హెచ్చరించడం ఇదే మొదటిసారి కాదు. 2025 ప్రారంభం ఫిబ్రవరిలో కూడా ఇలాగే "చరిత్రలో అతి పెద్ద స్టాక్ మార్కెట్ క్రాష్" రాబోతోందంటూ అంచనా వేస్తూ ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసే ప్రయత్నం చేశారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లు వాడకూడదు



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక కార్యక్రమాల్లో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించే దిశగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్ణయం తీసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు వాడకూడదని, అందుకు బదులుగా స్థిరమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన ఈ నోట్‌లో పర్యావరణం పట్ల బాధ్యత, స్వదేశీ ఉత్పత్తుల ప్రచారం పట్ల రాష్ట్రం నిబద్ధతను ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. ఈ ఆదేశాల అమలులో భాగంగా సచివాలయంలో జరిగే సమావేశాలు, అధికారిక కార్యక్రమాల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (KMF) ఆధ్వర్యంలో 'నందిని' ఉత్పత్తులను తప్పనిసరిగా ఉపయోగించాలని సీఎం ప్రత్యేకంగా ఆదేశించారు. గతంలో కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి కోసం ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు బదులుగా పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే తాజా ఆదేశాలు ఈ చర్యను మరింత కఠినంగా అమలు చేయడానికి వీలవుతాయి.

**ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించడం ద్వారా..**

ప్లాస్టిక్ వ్యర్థాలు, ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు పర్యావరణానికి, జల వనరులకు, నేలకు తీవ్రనష్టం కలిగిస్తాయి. వీటిపై నిషేధం దీర్ఘకాలిక పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. తిరిగి ఉపయోగించగల సీసాలు, గాజు కంటైనర్లు లేదా స్థానికంగా లభించే ఇతర పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాల వాడకానికి ఇది దారి తీస్తుంది. ప్రభుత్వమే ఈ పద్ధతులను అవలంబించడం ద్వారా ప్రజలకు, ప్రైవేట్ సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుంది.

**నందిని పాల ఉత్పత్తులపై ప్రభావం**


ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అధికారిక కార్యక్రమాలలో 'నందిని' ఉత్పత్తులను తప్పనిసరిగా ఉపయోగించాలి. ఈ నిర్ణయం కేవలం పర్యావరణ పరమైన నిర్ణయమే కాకుండా రాష్ట్రంలోని స్థానిక ఆర్థిక వ్యవస్థ, పాడి పరిశ్రమకు మద్దతు ఇచ్చే ఒక వ్యూహాత్మక చర్యగా ఉంటుంది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (KMF) నందిని బ్రాండ్‌కు ఈ నిర్ణయం అనేక రకాలుగా లబ్ధి చేకూరుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక కార్యక్రమాల్లో నందిని ఉత్పత్తులను (ఉదాహరణకు, టీ/కాఫీ కోసం పాలు, లస్సీ/మజ్జిగ, నీటి కోసం పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్‌లోని ఉత్పత్తులు) తప్పనిసరిగా ఉపయోగించడం వల్ల కంపెనీకి స్థిరమైన, పెద్ద మొత్తంలో డిమాండ్ ఏర్పడుతుంది. ప్రభుత్వమే తమ ఉత్పత్తులను వినియోగించడంతో నందిని బ్రాండ్ విశ్వసనీయత, జాతీయ స్థాయి ఇమేజ్ పెరుగుతుంది.

**స్థానిక పాడి పరిశ్రమ అభివృద్ధి**

ఈ ఆదేశాల వల్ల కర్ణాటకలోని పాడి రైతులకు, పాడి పరిశ్రమకు లబ్ధి చేకూరుతుంది. KMF రాష్ట్రంలోని లక్షలాది మంది పాడి రైతులకు, గ్రామీణ ప్రాంతాల మహిళలకు జీవనోపాధి కల్పిస్తుంది. నందిని ఉత్పత్తుల డిమాండ్ పెరిగితే KMF పాల సేకరణను పెంచుతుంది. తద్వారా పాడి రైతులకు స్థిరమైన, మెరుగైన ధర, ఆదాయ భద్రత లభిస్తుంది. పాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, పంపిణీ రంగాల్లో పెరిగే కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుతాయి.

# ఇంతకాలం కలల్ని అమ్ముకున్నారు.. ఇప్పుడు స్థానం లేదంటారా?

**అమెరికా ఉపాధ్యక్షుడు, ఆంధ్రా అల్లుడు జేడీ వాన్స్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని భారతీయ మూలాలున్న ఓ యువతి వాన్స్ ముఖం మీదే ఎండగట్టింది. అంతేకాదు.. ఆయన వ్యక్తిగత జీవితంపైనా ఆమె వేసిన ఓ ప్రశ్నతో ఆయన ఇబ్బందిపడినట్లు కనిపించారు.**



అమెరికాలోని మిసిసిప్పీ విశ్వవిద్యాలయంలో టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ అనే ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వాన్స్ ప్రసంగిస్తూ.. అమెరికాలో కఠినమైన వీసా పరిశీలన విధానానికి మద్దతు ప్రకటించారు. అమెరికాలోకి చట్టబద్ధంగా వచ్చే వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో.. భారతీయ సంతతికి చెందిన ఓ యువతి మైక్ అందుకుంది. ఆయన్ని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసింది. ''మీరు ఇంతకాలం అమెరికా కలల్ని మాకు అమ్మారు, మా యవ్వనాన్ని, సంపదను ఖర్చు పెట్టించారు. అలాంటిది ఇప్పుడేమో ఎక్కువ మంది వస్తున్నారు.. వాళ్లను వెనక్కి పంపాలి అంటారా?.. మాకు ఇక్కడ స్థానం లేదంటారా?. మేము చట్టబద్ధంగా వచ్చాం, మీ నిబంధనలు పాటించాం. ఇప్పుడు మమ్మల్ని ఇక్కడికి చెందనివాళ్లమంటారా?'' అని వాన్స్‌ను నిలదీశారు. ఆ సమయంలో.. కొందరు చప్పట్లు చరుస్తూ ఆమెను అభినందించడం గమనార్హం. అయితే వాళ్లను వారిస్తూ ఆమె ఈ ప్రశ్నతో గొడవ చేయాలన్నది తన ఉద్దేశం కాదంటూ స్పష్టం చేశారు. దానికి వాన్స్ సమాధానం ఇవ్వలేదు. బదులుగా.. అత్యధిక ఇమ్మిగ్రేషన్ అమెరికా సామాజిక నిర్మాణాన్ని దెబ్బ తీస్తుందని.. కొంతమంది అక్రమ వలసదారులు దేశానికి మేలు చేశారని.. అంతమాత్రాన అందువల్ల లక్షల మందిని అనుమతించాల్సిన అవసరం లేదు అని అభిప్రాయపడ్డారు. ఆ వెంటనే.. ఆ యువతి.. అమెరికాను ప్రేమించాలంటే క్రిస్టియన్ కావాల్సిందేనా? అని అడిగింది. దానికి వాన్స్ స్పందిస్తూ తాను మత బోధనను విశ్వసిస్తానని.. తన భార్య కూడా భవిష్యత్తులో అదే విశ్వాసాన్ని కలిగి ఉంటుందని ఆశిస్తున్నానని చెప్పారు. అయితే, ఆమెకు స్వేచ్ఛ ఉందని, అది తనకు సమస్య కాదని అన్నారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీశాయి. వాన్స్ వైఖరిపై ఇండో అమెరికన్లు మండిపడుతున్నారు. హిందూ భార్యను కలిగి ఉండి, మతపరమైన మార్పును ఆశించడం ద్వంద్వ వైఖరేనంటూ పలువురు వ్యాఖ్యానించారు. వాన్స్ వివాహం వేద హిందూ సంప్రదాయంలో జరిగినదని కూడా కొందరు గుర్తు చేశారు. వాన్స్‌ను ప్రశ్నించిన ఆమె ఎవరన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# వేలానికి మరో బంగారు టాయిలెట్



**న్యూయార్క్:** ప్రముఖ ఆర్టిస్ట్ మౌరిజియో క్యాటల్లాన్ రూపొందించిన కొత్త బంగారు టాయిలెట్ త్వరలో వేలానికి రానుంది. ఆయన గతంలో రూపొందించిన బంగారు టాయిలెట్‌ను దుండగులు అపహరించుకుపోయారు. అలాంటిదే మరో బంగారు టాయిలెట్‌ను క్యాటల్లాన్ రూపొందించటంతో దానిని ఈ నెల 18న ప్రముఖ వేలం సంస్థ సౌత్‌బే వేలం వేయనుంది. క్యాటల్లాన్ మొదట రూపొందించిన బంగారు టాయిలెట్ దాదాపు 100 కిలోల 18 క్యారెట్ల బంగారంతో తయారైంది. దాని పేరు అమెరికా. అది గొప్ప ఆర్ట్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. దానిని మొదట 2016లో న్యూయార్క్‌లోని గుగ్గెన్‌హీమ్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచినప్పుడు దాదాపు లక్ష మంది సందర్శించారు. దానిని కొనుగోలు చేసేందుకు నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఆసక్తి చూపించారు. అయితే, దానిని బ్రిటన్‌లోని బ్లెన్‌హీమ్ ప్యాలెస్‌లో ప్రదర్శనకు ఉంచగా, 2019లో దొంగలు నాలుగు నిమిషాల్లోనే దోచుకెళ్లారు. ఎంత గాలించినా అది మళ్లీ కనిపించలేదు. దానిని దొంగలు కరిగించి బంగారాన్ని అమ్మేసి ఉంటారని భావిస్తున్నారు. అలాంటిదే మరో టాయిలెట్‌ను క్యాటల్లాన్ తయారు చేయటంతో ఈ నెలలో వేలం వేస్తున్నారు. దీనికి భారీ ధర పలుకొచ్చని భావిస్తున్నారు. క్యాటల్లాన్ బనానా ఆర్టిస్ట్‌గా కూడా ప్రసిద్ధి చెందారు. ఓ గోడపై టేపుతో అరటి పండును అతికించి ప్రదర్శనకు ఉంచటం ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యింది.

# ఎత్తు తగ్గి కుదుపులకు లోనైన విమానం..


## 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలు

**టాంపా:** విమానం ఎత్తులో ఆకస్మిక తగ్గుదల కారణంగా ఒక్కసారిగా కుదుపులకు లోనై కనీసం 20మంది ప్రయాణికులు గాయపడ్డారు. గురువారం మెక్సికోలోని కాంకున్ నుంచి టేకాఫ్ తీసుకున్న జెట్‌బ్లూ సంస్థ ఎయిర్ బస్ విమానం న్యూజెర్సీలోని నెవార్క్ విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, అమెరికాలోకి ప్రవేశించిన తర్వాత అకస్మాత్తుగా విమానం దిగువకు వచ్చింది. కుదుపులకు లోనవడంతో ప్రయాణికులు సీట్లలో నుంచి ఎగిరిపడ్డారు. ప్రమాదాన్ని శంకించిన పైలట్ విమానాన్ని టాంపా అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. గాయపడిన కనీసం 20 మంది ప్రయాణికులను వెంటనే ఆస్పత్రులకు తరలించారు. వీరెవరికీ ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. కాగా, విమానంలో మొత్తం 162 సీట్లుండగా ప్రయాణికులెందరనే విషయంలో స్పష్టత లేదు.



# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 02-11-2025



# రామ్ చరణ్ పెద్ది నుంచి జాన్వీ ఫస్ట్ లుక్ రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రామ్ చరణ్తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్షన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు భట్టాచార్య వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# ఆ సినిమాకు సీక్వెల్ రాబోతున్నదా?

ప్రస్తుతం సాయిదుర్గతేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. సాయిదుర్గతేజ్ కెరీర్లో భారీ చిత్రంగా నిర్మాత నిరంజన్రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానున్నది. రోహిత్ దర్శకుడు. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం సాయిదుర్గతేజ్ ఓ కొత్త సినిమా ఒప్పుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాకు దేవకట్టా దర్శకత్వం వహిస్తారట. వీరిద్దరి కాంబినేషన్లో గతంలో 'రిపబ్లిక్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్గా ఈ తాజా సినిమా ఉండనున్నదని టాక్. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.






# ఛాంపియన్ లా రోషన్.. టీజర్

టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ కుమారుడు రోషన్ (Roshan) కొత్త సినిమా 'ఛాంపియన్' (Champion). సుమారు నాలుగేళ్ల తర్వాత వెండి తెరపైకి తిరిగొస్తున్నాడు. దీంతో తాజాగా ఈ మూవీ టీజర్ను మేకర్స్ విడుదల చేశారు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి. డిసెంబరు 25న రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం డైరెక్ట్ చేస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాపై రోషన్ చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఛాంపియన్ సినిమాలో అతను ఫుట్ బాల్ ఆటగాడిగా రాబోతున్నాడు. ఇప్పటి వరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో రోషన్ కనిపించబోతున్నారు . ఈ పాత్ర కోసం ఫిజికల్గానూ ట్రాన్స్ఫర్మేషన్ అయ్యారని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం మిక్కీ జె. మేయర్ అందించారు.




# శంబాల ఏం జరుగుతుంది

## విజువల్ వండర్లా ట్రైలర్

టాలీవుడ్ హీరో ఆది సాయికుమార్(Aadi Sai Kumar) నటించిన కొత్త సినిమా 'శంబాల: ఏ మిస్టికల్ వరల్డ్'(Shambhala)... డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా మూవీ ట్రైలర్ను ప్రభాస్ రిలీజ్ చేశారు. సూపర్ నేచురల్ థ్రిల్లింగ్తో పాటు సిల్వర్ స్క్రీన్పై విజువల్ వండర్ను క్రియేట్ చేసేలా ట్రైలర్ ఉంది. ఈ సినిమాతో ఆది హిట్ అందుకునేలా ఉన్నాడు. ఇందులో అర్చన అయ్యర్ హీరోయిన్గా నటించగా స్వాసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ కీలక పాత్రల్లో నటించారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన యుద్ధమే ఈ కథకు మూలం అంటూ సాయికుమార్ వాయిస్తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇందులోని డైలాగులు అన్నీ కూడా ప్రేక్షకులను ఆసక్తి కలిగించేలా ఉన్నాయి.




# కేకపెట్టించిరోయ్..

ప్రస్తుతం సినిమా హీరోహీరోయిన్స్ రేంజ్ లో సీరియల్ తారలు సైతం ఫాలోయింగ్ సంపాదించుకుంటున్నారు. బుల్లితెరపై చీరకట్టులో ఎంతో పద్ధతిగా, హుందాగా కనిపించే పలువురు తారలు.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామర్ అరాచకం సృష్టిస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మముడి ఫేమ్ రుద్రాణి అలియాస్ షర్మిత గౌడ గ్లామర్ క్వీన్ గా నెట్టింట రచ్చ చేస్తున్న సంగతి తెలిసిందే. నెగిటివ్ షేడ్స్ ఉన్న విలన్ పాత్రలో కనిపించినప్పటికీ ఈ బ్యూటీకి విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇక ఇప్పుడు ఆ ముద్దుగుమ్మ దారిలోనే మరో భామ సైతం అందాలతో నెటిజన్లను కట్టిపడేస్తుంది. స్మాల్ స్క్రీన్ పై ఎంతో పద్ధతిగా కనిపించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు నెట్టింట షేర్ చేసిన క్రేజీ ఫోజులు చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. ఇంతకీ పైన ఫోటోలో కనిపిస్తున్న వయ్యారి ఎవరో గుర్తుపట్టారా.. ? టీవీ రంగంలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న నటి.

ఇన్నాళ్లు తల్లి పాత్రలు పోషించిన ఆమె.. ఇప్పుడు వెండితెరపై హీరోయిన్ గా దూసుకుపోతుంది. ఆమె మరెవరో కాదండి.. బుల్లితెరపై అత్యధిక టీఆర్పీ రేటింగ్ అందుకున్న గుప్పెడంత మనసు సీరియల్ ఫేమ్ జగతి మేడమ్.. అలియాస్ జ్యోతిరాయ్. ఈబ్యూటీకి తెలుగు రాష్ట్రాల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. జగతి మేడమ్ పాత్రలో చీరకట్టులో ఎంతో హుందాగా కనిపిస్తూ.. సహజ నటనతో జనాలను కట్టిపడేసింది. ముఖ్యంగా తన కొడుకు రిషి ప్రేమ కోసం ఆరాటపడే తల్లి పాత్రలో అద్భుతమైన నటనతో జనాల హృదయాలను గెలుచుకుంది. ఈ సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఈ సీరియల్లో తల్లి పాత్రలో నటించిన జ్యోతిరాయ్.. ఇప్పుడు హీరోయిన్ గా మారింది. ప్రస్తుతం ఆమె కథానాయికగా కిల్లర్ అనే చిత్రంలో నటిస్తుంది. లేడీ ఓరియెంటెడ్ మాస్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా టీజర్, గ్లింప్స్ మరిన్ని అంచనాలు క్రియేట్ చేశాయి.


అయితే కథానాయికగా మారిన తర్వాత జ్యోతిరాయ్ నెట్టింట ఫుల్ యాక్టివ్ అయ్యింది. నిత్యం క్రేజీ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ తెగ సందడి చేస్తుంది. ముఖ్యంగా గ్లామర్ ఫోటోషూట్లతో నానా రచ్చ చేస్తుంది. తాజాగా పొట్టి గౌనులో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఒకప్పుడు చీరకట్టులో పద్ధతిగా కనిపించిన జ్యోతిరాయ్.. ఇప్పుడు ఇలా గ్లామర్ ఫోజులతో ఫోటోస్ షేర్ చేయడం చూసి జనాలు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పుడిప్పుడే వరుసగా హీరోయిన్ అవకాశాలు అందుకుంటుంది జ్యోతిరాయ్.



# అందుకే కెరీర్ పరంగా సక్సెస్

బ్యూటీ సమంత గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ తన క్యూట్ నెస్, అందం, నటనతో ఎంతో మంది మదిని దోచుకుంది. టాలీవుడ్లో వరసగా బ్లాక్ బస్టర్స్ అందుకొని సత్తా స్టార్ హీరోయిన్గా సత్తా చాటింది. కాగా, బ్యూటీ తన కెరీర్ మంచి ఫామ్లో ఉన్న సమయంలో కొన్ని సినిమాలు రిజక్ట్ చేసింది. దీంతో ఈబ్యూటీకి ఫ్లాప్స్ అనేవే లేకుండా పోయాయి. మరి ఈ ముద్దుగుమ్మ రిజక్ట్ చేసిన ఆ ఫ్లాప్ మూవీస్ ఏవో చూద్దాం పదండి. అలాగే డిజాస్టర్ మూవీస్లలో విక్రమ్ ఐ మూవీ కూడా ఒకటి. ఈ మూవీలో అమీర్ జాక్సన్ హీరోయిన్గా నటించి మెప్పించింది. కాగా, సినిమాలో మొదటగా హీరోయిన్గా సమంతను తీసుకోవాలి అనుకున్నారంట, కానీ పలు కారణాల వలన ఈ బ్యూటీ ఐ మూవీని రిజక్ట్ చేసిందంట. అలాగే నాని నిన్ను కోరి మూవీ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇక నాని, సమంత కాంబోలో వచ్చిన చాలా సినిమాలో మంచి హిట్ అందుకున్నాయి. అయితే అలానే నిన్ను కోరి మూవీలో కూడా నాని సరసన సమంతను హీరోయిన్గా ఎంపిక చేశారంట. కానీ తాను బిజీగా ఉండటం వలన సామ్ ఈ మూవీని రిజక్ట్ చేసినట్లు సమాచారం. అదే విధంగా రామ్ చరణ్, అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన సినిమా ఎవడు. ఇందులో శృతి హాసన్, కాజల్ హీరోయిన్స్గా నటించారు. అయితే ఈ మూవీలో సమంతకు అవకాశం వచ్చిందంట, శృతి హాసన్ స్థానంలో సమంత నటించాల్సి ఉండేదంట. కానీ తనకు అనారోగ్య సమస్యలు ఉండటంతో సమంత ఈ మూవీని రిజక్ట్ చేసి, ఫ్లాప్ నుంచి తప్పించుకుంది. రామ్ చరణ్, రకుల్ ప్రీత్ సింగ్ కాంబోలో వచ్చిన బ్రూస్ లీ మూవీ రిలీజై డిజాస్టర్ అయ్యింది. అయితే ఈ మూవీలో హీరోయిన్గా మొదటగా, సమంతను అనుకున్నారంట మూవీటీం. దీంతో సమంతను సంప్రదించగా, సమంతకు డేట్స్ ఖాళీ లేకపోవడంతో, ఈ మూవీని రిజక్ట్ చేసిందంట. అలా సమంత ఫ్లాప్ మూవీ నుంచి బయటపడిందంట.

# ఈసారి హిట్ కొట్టేది ఎవరు? లేదంటే మాత్రం



తెలుగులో చాలావరకు పెద్ద సినిమాలన్నీ పండగల్ని టార్గెట్ చేసుకుని థియేటర్లలోకి వస్తుంటాయి. ఈ ఏడాదికి అన్ని పండగలు అయిపోయాయి. మిగిలింది క్రిస్మస్ మాత్రమే. దానికి ఇంకా చాలా సమయముంది. నవంబరులో ఎప్పుడూ చెప్పుకోదగ్గ రిలీజులేం ఉండవు. ఈసారి మాత్రం కంటెంట్ పరంగా ఆకట్టుకుంటాయనే పలు చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఇంతకీ నవంబరులో థియేటర్లలోకి వచ్చే తెలుగు సినిమాలేంటి? వాటి సంగతేంటి? గత రెండు నెలలు (సెప్టెంబరు, అక్టోబరు) టాలీవుడ్ బాక్సాఫీస్ బాగానే కళకళలాడింది. లిటిల్ హార్ట్స్, మిరాయ్, కిష్కింధపురి, ఓజీ, కె ర్యాంప్ చిత్రాలతో కాస్త హిట్ కళ కనిపించింది. నవంబరులోనూ అలా అరడజనుకు పైగా కాస్త పేరున్న మూవీస్ థియేటర్లలోకి రాబోతున్నాయి. వీటిలో రష్మిక ద 'గర్ల్ ఫ్రెండ్', దుల్కర్ సల్మాన్ 'కాంత', రామ్ 'ఆంధ్రా కింగ్ తాలుకా' ఉన్నంతలో ఆసక్తి రేపుతున్నాయి. తొలివారంలో రష్మిక 'ద గర్ల్ ఫ్రెండ్' రానుంది. ఇది హిట్ కావడం ఈమెకు చాలా కీలకం. ఎందుకంటే ఈమె చేసిన తొలి ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీ ఇది. ట్రైలర్ అయితే డిఫరెంట్ మూవీ చూడబోతున్నామనే ఫీల్ కలిగించింది. మరోవైపు మహేశ్ బాబు బావమరిది సుధీర్ బాబు 'జటాధర'తో ఈ వారమే రానున్నాడు. ప్రస్తుత ట్రెండ్ అయిన సూపర్ నేచురల్ ఎలిమింట్ కాన్సెప్ట్తో ఈ చిత్రాన్ని తీశారు. ఇది హిట్ కావడం కూడా హీరోకి చాలా ఇంపార్టెంట్. ఎందుకంటే గత కొన్నేళ్లుగా సుధీర్ బాబుకి హిట్ లేదు. వీటితో పాటు తిరువీర్ 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రం కూడా ఇదే వారం రానుంది. రెండో వారంలో దుల్కర్ సల్మాన్ 'కాంత' వస్తుంది. ఓ దర్శకుడు, హీరో, హీరోయిన్.. వాళ్ల మధ్య ఈగో అనే కాన్సెప్ట్తో తీసిన పీరియాడిక్ మూవీ ఇది. గతేడాది 'లక్కీ భాస్కర్' అనే స్ట్రెయిట్ తెలుగు మూవీతో హిట్ కొట్టిన దుల్కర్.. ఈసారి కూడా హిట్ కొడితే టాలీవుడ్లో సెటిలైపోవచ్చు. ఇదే రోజున చాందిని చౌదరి 'సంతాన ప్రాప్తిరస్తు' అనే మూవీ రానుంది. దీనిపై పెద్దగా అంచనాల్లేవు. మూడోవారానికి ప్రస్తుతానికి కొత్త సినిమాలేం షెడ్యూల్ కాలేదు. చివరి వారంలో మాత్రం రామ్ 'ఆంధ్రా కింగ్ తాలుకా' ఒక్కటే రానుంది. మాస్ని నమ్ముకుని గత రెండు మూడు మూవీస్తో పూర్తిగా నిరాశపరిచిన రామ్.. ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలని అనుకుంటున్నాడు. ఇతడి కోరిక 'ఆంధ్రా కింగ్ తాలుకా'తోనైనా నెరవేరుతుందా అనేది చూడాలి? ఈ చిత్రంతో పాటు 'కాంత'లోనూ భాగ్యశ్రీ బోర్సేనే హీరోయిన్. అంటే రెండు వారాల గ్యాప్లో భాగ్యశ్రీ రెండు చిత్రాలతో తన అదృష్టం పలకరించుకోనుంది. పైన చెప్పిన సినిమాలే కాకుండా మోహన్ లాల్ 'వృషభ' (నవంబరు 06), కృష్ణలీల (నవంబరు 7), ప్రేమిస్తున్నా (నవంబరు 07), స్కూల్ లైఫ్ (నవంబరు 14), ధనుష్ హిందీ మూవీ 'తేరే ఇష్క్ మే' (నవంబరు 28) తదితర సినిమాలు కూడా ఇదే నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి వీటిలో ఏది హిట్ అవుతుందో చూడాలి?

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com